

# దత్తోహమస్మి



యోగిరాజ శ్రీ స్వామి స్వప్రకాశానంద తీర్థావధూత




జై గురుదేవదత్త



యోగిరాజ శ్రీ స్వామి స్వప్రకాశానంద తీర్థావధూత

మన గురుమహరాజ్ స్వామి స్వప్రకాశానంద తీర్థావధూత యోగిరాజ పరమహంస పాదపద్మములకు శతకోటి నమస్కారములతో సదా వారి ఆశీస్సులు మామీద వర్షించవలెనని ప్రార్థన చేయుచూ శిష్యబృందము, సమస్త గురుకుటుంబము.



జై గురుదేవదత్త

# అవతారిక

**"దత్తోహమస్మి"** అను ఈ పుస్తకము జూలై 2015 న జరుగు శతజయంతి ఆనందోత్సవ సందర్భమున యోగిరాజ శ్రీ స్వామి స్వప్రకాశానంద తీర్థావధూతలకు భక్తిప్రపత్తులతో సమర్పించిన చిరు అక్షరకానుక. సమస్త శిష్యులు, భక్తులు, అభిమానులు "గురువుగారు" అని ప్రేమాభిమానములతో కొలిచే **వారిపరిపూర్ణ జీవనపరమార్థము ఒక స్వప్రకాశ మార్గ దర్శక దివ్య జ్యోతి.**

అనాదినుండి మానవుడు సకల చరాచర సృష్టికర్త, వాని వ్యక్త విధానము, ఆ సృష్టికర్తకు తనకు గలసంబంధము - ఇత్యాది విషయజ్ఞాన సముపార్జనకై నిరంతరము అన్వేషించుచున్నాడు. అనంతానందము, బాహ్యాంతర శాంతి, సంసారబంధముల నుండి విముక్తి – ఆ జ్ఞానము ఇచ్చునని ఆశ.

ఈ అన్వేషణ ప్రతీ సాధకుని ప్రవృత్తినిబట్టి వివిధ ఆధ్యాత్మిక ప్రక్రియలకు దారి తీసినది. పలు సాంప్రదాయములు భారత దేశములో అభివృద్ధికి ఇదే కారణము. నియమ, ఆచార, విధుల సముదాయమే సాంప్రదాయము. వేలాది సంవత్సరముల పరిణామము నొందిన ఈ సాంప్రదాయములన్ని సనాతన ధర్మము పరిధిలో ఉన్నవి. అందున విష్ణు, శివ, శక్తి కేంద్రీకృతమైన

సాంప్రదాయములు ప్రసిద్ధి చెందినవి. ఈ సాంప్రదాయముల మధ్య వైరములేదు.

ప్రతీ సాంప్రదాయము ఒక దైవత్వపు విశిష్ట లక్షణ ఆరాధనపై కేంద్రీకరించగా, దత్త సాంప్రదాయము మాత్రము, నిజమైన ఆత్మజ్ఞాన అభిలాషికి అత్యంత శ్రేష్టమైన మార్గముగా ప్రసిద్ధిచెందినది. ఆత్మ సందర్శన ఫలితముగా లభ్యమగు మోక్షమునకు సాధకుని నడిపించగల ఆదిగురువులుగా శ్రీ దత్తాత్రేయస్వామి బహుళజన ఆరాధ్యదైవములైరి.

శ్రీ దత్తాత్రేయులతో మొదలిడిన గురువుల అవతార పరంపర ఒక అవిచ్ఛిన్న క్రమమై ఉన్నది:- శ్రీపాదశ్రీవల్లభులు, శ్రీనృసింహసరస్వతులు, స్వామి సమర్థులు, మాణిక్యప్రభువులు, వాసు దేవానంద సరస్వతులు, షిరిడీసాయి బాబా, గజానన మహరాజ్ - ప్రతి ఒక్కరు అనేక శతాబ్దములుగా సాధకులకు మార్గనిర్దేశము చేయుచున్నారు.

బ్రహ్మ విష్ణు మహేశ్వరుల ఏకైకస్వరూపమైన శ్రీదత్తాత్రేయులకు తమ తపఃఫలిత ప్రభావ ప్రకాశ ప్రసాదముగా మహర్షిఅత్రి అనసూయలు తల్లిదండ్రులు అయిరి. మూడుతలలు ఆరుచేతులు శంఖ చక్ర త్రిశూల కమండల జపమాల

ఢమరుకలతో శ్రీదత్తాత్రేయులు అవతరించిరి. నాలుగు శునకములు బ్రాహ్మజ్ఞాన కోశాగారములుగా, సత్యధర్మ రక్షకులుగా చతుర్వేదములను సూచించును. ప్రకృతి వీరికి వశమై కామధేను రూపములో సర్వదా వారి వద్ద ఉంటుంది. కుల, మత, జాతి, లింగ మొ|| వానితో పనిలేకుండా, ఆత్మ జ్ఞానము నిచ్చు 'జ్ఞానకల్పవృక్షము'గా కూడా వారు అభివర్ణింపబడిరి. ఇతర అవతారములు, ఆ అవతార లక్ష్యము పరిసమాప్తమైన వెంటనే భౌతిక కాయములను విడువగా, శ్రీదత్తాత్రేయులు మాత్రము సాధకులకు ఎల్లప్పుడు ఆశీస్సులు మార్గ నిర్దేశము కొనసాగించుచుండిరి.

దివ్యజ్ఞానము ప్రతి ఒక్క మత అవధులను, పరిస్థితులను, సిద్ధాంతములను దాటి ఉండును కావున, సమస్త విశ్వాస సంగ్రహమైన శ్రీదత్తసాంప్రదాయము భారతదేశపు అతిముఖ్యమైన సాంప్రదాయములలో ఒకటియై ఉన్నది.

ఈ సాంప్రదాయములో చతుర్విధ మార్గములైన కర్మ, భక్తి, రాజ, జ్ఞాన, యోగములు సమానముగా సమ్మేళనమై పూర్ణత్వమును పొందినవి. త్రిమూర్తి స్వరూపులైన శ్రీదత్తాత్రేయులు, బ్రహ్మవిష్ణు మహేశ్వరుల ఉపస్థితిలో వారి మౌలిక ఏకత్వమును సూచిస్తున్నారు. "ఏక ఏవ త్రిధాస్మృతః" - మూడు విధములుగా భావింపబడిన ఏకతత్వము.

మన ప్రియతమ గురువుగారు - యోగిరాజ శ్రీస్వామి స్వప్రకాశానంద తీర్థావధూతలు - శ్రీదత్తసాంప్రదాయములో ఒక అద్భుత ఆధ్యాత్మిక శక్తి ధామము. గురువు గారి అవతరణ పరమార్థము ఏమి? వైభవోపేతులు అయిన గురువుగారి వంటి మహాపురుషుని గురించి వ్రాయుట బహుక్లిష్టము. పావన పురుషులు దైవాంశులు, కారణజన్ములు. "బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి"- బ్రహ్మను అంతఃకరణలో గుర్తించిన వాడు బ్రహ్మయే అగును.

మనమధ్య సశరీరముగా గురువుగారు లేకపోయిననూ, వారు మనల్ని సదా నడిపించెదరు. నిజమైన భక్తులకు వారు దర్శనమిచ్చెదరు. నిత్యసంస్మరణ, సంపూర్ణ శరణాగతితో జీవించుటయే గురువు గారి ఆశీస్సులకు మన మీయగలిగిన ప్రతిఫలము.

**"దత్తోహమస్మి"** అనగా దత్తుడు-నేను-ఒక్కరె అనిఅర్థము. ఇది అసలైన సాధకునికి అత్యంత ధ్యేయము. ఈ బాట మీద పయనించమని గురువుగారు మనల్ని ఆశీర్వదించిరి. వారి పవిత్ర చరణములచెంత నుంచబడిన ఆత్మ పుష్పము ఈ పుస్తకము. అనేకులను అనేక సంవత్సరములు వారి జీవితకాలములో మోక్షపథమున నడిపించి, ఇంకను నడిపిస్తున్న గురువుగారికి ఇది ఒక సేవ, ఒక ఉపచారము.

సాధన చేసి ప్రతి ఒక్కరు శ్రీదత్తాత్రేయుల దివ్యపాదములను చేరవలెనని చేయు ప్రార్థన ఇది. వారి జీవితకాలమంతను **"గురు పాద ద్వయాయనమః"** మంత్రసాధన ప్రాముఖ్యత గురించి గురువుగారు నొక్కి చెప్పెడివారు. ఇది ముమ్మాటికి వారి గురుతత్త్వము.

గురువుగారి దివ్య మహత్త్వము గురించి ఈ పుస్తకం జిజ్ఞాసను మేలుకొల్పిన ప్రతీ భక్తునికి చేయూత నిచ్చి గురువుగారు ప్రగతి పథంలో నడిపించెదరు. మనఃపూర్వకంగా పరితపించు సాధకుల ఆర్తికి వెనువెంటనే స్పదించు నిత్య సత్య దైవమే మన గురువుగారు.

**ధ్యానమూలమ్ గురోర్మూర్తిః పూజామూలమ్ గురోర్పదమ్ ।**
**మంత్రమూలమ్ గురోర్వాక్యం మోక్షమూలమ్ గురోర్కృప ॥**

జై గురుదేవదత్త

# మహంతిగారి అనుగ్రహ సందేశము

స్వామి స్వప్రకాశానంద తీర్థావదూత గారికి, వారి శతజయంతి ఉత్సవాల సందర్భంగా, వారి ప్రియ మిత్రుడు, ఆధ్యాత్మిక ఆత్మబంధువుగా వారి చరణకమలములకు భక్తిపూర్వకంగా నా నమస్కారములు.

స్వామివారి రూపము మధురమైనది, తేజోమయమైనది, సరళమైనది మరియు కరుణారసభరితమైనది. వారు ఆశ్రయమిచ్చువారు, మితాహారి, మితముగా నిద్రించువారు, నిరాడంబరులు, ప్రేమమూర్తులు, కరుణామయులు, ఓర్పుకలవారు, మృదుభావన కలవారు, సహనము కలవారు, కోరికలు, లోభము, హరము, రోషము లేనివారు. బాధాకరమైన సన్నివేశాలలోకూడా వారి మనస్సు చింతచెందదు. వారు సుఖ దుఃఖాలకు అతీతులు. వారు భయానికి, క్రోధానికి, రాగద్వేషాలకు అతీతులు. వీరు ఈ కలియుగంలో సులభంగా అందుబాటులో ఉన్న అతి ఉత్తమ మహర్షి. సశరీరంగా లేకపోయినా ఇప్పటికీ మనలను ఆశీర్వదించి, మన అభీష్ఠములను తీరుస్తూ మనలను సంరక్షిస్తున్నారు.

**మానవుడు పొందుతాడు-మరచిపోతాడు** కాని **గురువు ఇస్తారు-క్షమిస్తారు.** ఎల్లవేళలా గురుస్మరణ ఉండాలని మా వినయపూర్వక ప్రార్ధన. అట్లయినచో వారు మనని ఆదుకుంటారు.

అతి ప్రీతిపాత్రులయిన సాక్షాత్ దైవమయిన స్వామి వారికోసం ఈ రెండు వాక్యములు వ్రాము అవకాశాన్ని కలిగించినందుకు నాప్రగాఢమైన కృతజ్ఞతలు.

శ్రీ బన్సీధర్ మహంతి
(శ్రీ శ్రీ బిజయ్‌కృష్ణ ఆశ్రమ్ - శిఖరపూర్)

కటక్, ఒరిస్సా
మార్చ్ 2015

**ఓం శ్రీ అవధూత తీర్థ, స్వామి స్వప్రకాశానందనాథ ।**
**శిష్య అనుగ్రహ రూపా, హే దత్తస్వరూపా ।**
**ఓం శ్రీ గురునాథా, ఓం శ్రీ గురునాథా ।**

జై గురుదేవదత్త

# పూజ్యులు శ్రీ బాబుజీ ప్రేరణ

పూజ్యులు శ్రీరాజేంద్ర గిరి మహారాజ్, బరోడా సమీప మందున్న రాణులోని శ్రీమాతా తుల్జాభవాని ఆలయ మహాంతులు. వారిని బాబుజీ అని ప్రేమ పూర్వకముగా పిలుస్తారు. జూలై 2014 లో వారు  గురువుగారి ఆశ్రమమును సందర్శించిరి. **"ఇక్కడ గురువుగారు జాగృత రూపము నందున్నారు"** అని వారు నిర్ధారించిరి.

గురువుకై భక్తి భావముతో పరితపించి అభిలషించువారికి దివ్య చైతన్యము సర్వత్రా గోచరమగునని శ్రీబాబుజీ వివరించిరి. భక్తితత్పరత, గురుముఖ లగ్నమైన ఏకాగ్రతతో అనుసంధాన మైనప్పుడు దివ్య చేతనమునకు బాటయగును. గురువు పై గలభక్తి విశ్వాస సాంద్రత గురువుతో తాద్యాత్మ్యతగా పరివర్తనము నొందును. అంకితభావులై పావన గురురూపమును హృదయమునందు ప్రతిష్ఠించిన నిశ్చయముగా అంతర్గత దివ్య గురువులసాక్షాత్కారమగును. అప్పుడు గురువు సారూపమా కాదా అనునది అప్రస్తుతమగును.

శ్రీరామసేతువు వానరుల భక్తి సామర్థ్యముపై నిర్మింపబడినది. భగవంతుడు భావనాప్రియుడు. భక్తుని భక్తి

విశ్వాసముల తీవ్రతనుబట్టి అవ్యక్త చైతన్యము కూడా వ్యక్త చైతన్యము సగుణరూపంగా సాక్షాత్కరిస్తుంది. ధర్మ నిష్ఠ ఉండినచో అరూప నిర్గుణ దైవత్వమును కూడ సగుణరూపమున సాక్షాత్కరించును. ఇదియే భక్తి తత్పరత యొక్క బలము.



శ్వాశ ప్రాణమునకు ఎంత అవసరమో, విశ్వాసము సమాజ పురోగతికి అంతే అవసరము. ఆత్మజ్ఞాన సముపార్జనయే అన్ని సాధనలపరమావధి. ఈ శరీరము మిధ్య అను స్పృహ, ఆధ్యాత్మిక పురోగమనమునందు మహత్తరమైన తొలి మెట్టు.

గురువుగారికి శ్రీ బాబుజీ "మాలామంత్రమును" సమర్పించిరి. గురువుగారి సంస్మరణ భావనగా శ్రీ బాబుజీ గురువుగారి నిజస్వరూపము, సాధన తత్వములను సర్వజన శ్రేయస్సుకై ప్రకటితము చేయమని సూచించిరి. వారి దీవెనలు మరియు స్ఫూర్తి 'దత్తోహమస్మి' రూపమును దాల్చినవి. అటువంటి ప్రేమమయులైన శ్రీ బాబుజీ చరణకమలమునకు భక్తి నమ్రత ప్రపత్తులతో శత సహస్రప్రణామములను సమర్పించుచున్నాము.

**తూ విశ్వరూప తుల్జామా**
**తూ చైతన్యరూప తుల్జామా**
**తూ సంత్ రూప తుల్జామా**
**తూ గురు రూప తుల్జామా**

# అధ్యాయము -1

# పావన జీవితము


# పావన జీవితము

గురువుగారి జన్మస్థలము ఆంధ్రప్రదేశ్‌లోని అనకాపల్లికి 10కిమీ సమీపమునున్న వెదుపర్తి గ్రామము. వారు శుక్రవారము రాత్రి అనగా శనివారము తెల్లవారుఝామున 3.30 ని॥ 31 జూలై 1915న ఉత్తరాభాద్ర నక్షత్రము, 2వపాదము, మిధునలగ్నము/ మీననవాంశనందు జన్మించిరి. అది రాక్షస నామ సంవత్సరము, ఆషాడ బహుళపంచమి అయినది. శ్రీకొడుకుల సూరిబాబుగారు శ్రీమతి సుబ్బలక్ష్మమ్మ గురువుగారి జన్మనిచ్చిన తల్లిదండ్రులు. వారి పెదనాన్న శ్రీకొడుకుల వెంకన్నగారు శ్రీమతి రాముడమ్మగారు వారి దత్తత తల్లిదండ్రులు. పూర్వాశ్రమములో (సన్యసించక ముందు) వారిపేరు "నరసింహము". కాని అందరు వారిని "సింహాలు" అని పిలిచేవారు. తమ 11వ యేట సర్వ సోదులమ్మ గారితో వివాహమైనది.

1935 లో వారి 20వ యేట, తమగురువులు శ్రీ పూర్ణానంద రాజయోగి (మార్వాశ్రమము, మాకవరపుపాల్యెము) వారి నుండి, ఆధ్యాత్మిక పథప్రవేశ దీక్షతీసికొని, బాలాత్రిపురసుందరి తదితర మంత్రములఉపదేశము పొందిరి. వారి గురువులు సాక్షాత్తు టిబెట్టు గురువులు మరు మహర్షి శిష్యులే!. గురువుగారు ప్రాధమిక విద్యాభ్యాసము కూడ చేయలేకపోయినా, సర్వశక్తిమంతుడయిన భగవంతుని కటాక్షమువలన అపారవేద శాస్త్ర సంస్కృత భాషా

జ్ఞానములు వారి సొంతములయినవి.

తమ 28వ యేట వరకు గురువుగారు కాశింకోటలో ఉండిరి. ఆ తరువాత వారు అనకాపల్లి వాస్తవ్యులైరి. 1947లో విజయనగరస్తులైన తమ గురువులు శ్రీ బ్రహ్మానందనాథ గారి నుండి మహావిద్యలు, పంచదశి, సప్తశతి, ఛండీ దీక్షలను పొందిరి. విశాఖపట్నములోని లలిత ఆశ్రమ స్థాపకులు శ్రీ జయంతి మంగయ్యగారి నుండి కూడ దీక్షను పొందిరి.

1950లో వారి 35వ యేట మండ్లరేవు సమీపమునున్న సిద్ధపురుషులు శ్రీ జ్ఞానానందసరస్వతి వారి పర్యవేక్షణలో దత్త సాంప్రదాయ ప్రవేశము చేసి, పూర్ణదీక్షను సముపార్జించిరి. 1952 లో వేదాంత మంత్ర శాస్త్రములను స్వయం కృషితో అభ్యసించి, వాటిపై గట్టి పట్టును సాధించిరి. 1953లో ఈ అభ్యాసక్రమంలో వారు తీవ్ర శారీరక కష్టములననుభవించిరి. 1955 నుండి వారు "గురువుగారు"గా వ్యవహరింపబడి, అనేక శిష్యులకు మంత్రోపదేశము చేసిరి. దీక్షలను యిచ్చిరి. వారు పలుమంత్రశాస్త్రవిజ్ఞానమును అభ్యసించి ఒడిస్సా, రాజమండ్రి, హిమాచలప్రదేశంలోని అనేక ప్రాంతములందు సాధన, అనుష్ఠానము చేసిరి. వారు ఆధ్యాత్మిక పరిజ్ఞానవికాశము కొరకు భారతదేశమంతటా పర్యటించిరి.

1957 నుండి వారు ఒక్కపూటే భుజించెడివారు. అది కూడ రెండు చిన్న గోధుమ రొట్టెలు (తరచుగా పాలకూరతో) మాత్రమే. 1958లో అష్టాదశపీఠముల ఉపదేశములనుండి సప్తకోటి మహామంత్ర అనుష్టానములను నేర్చుకొనిరి. వారు అభ్యసించిన మూలమంత్రముల మనన విశ్లేషణ ప్రక్రియలో బహుకాలము వారణాశినందు జపతపములచేయుచు గడిపిరి. ఈ బృహత్కార్యమునందు గురువుగారికి శ్రీదక్షిణా మూర్తి పరమహంస (విశాఖపట్నం) వారు చాలతోడ్పడిరి.

1973లో వారి 58వ యేట, తదితర సిద్ధమంత్రములతో సహా చింతామణి మంత్రమును సిద్ధింప చేసుకొనిరి. వేదవిద్యాపారంగుతులై "వేదవిజ్ఞాన" స్థాయిని సాధించిరి. హిమాలయలందు బదరీనాథ్, ఋషీకేశ్ - వారణాశి, విశ్వనాధునిగుడి - రెండు సంవత్సరములు మహేంద్రగిరి పర్వతము మీద, రాయఘుడ్ అడవులందు సంచరింస్తున్న క్రమంలో గురువుగారి తపస్సులు సాధనలు ఫలించినవి. భువనేశ్వరం లింగరాజు, పూరి జగన్నాథ ఆలయ ప్రాంగణములలో మహాపాదుకా సాధన చేసిరి.

1980 నాటికి వారి 65వ యేట విరజాహోమం నిర్వహించిరి. సంసారం పరిత్యజించి సన్యాసాశ్రమం స్వీకరించిరి. హరిద్వారము నందున్న సప్తఋషి సరోవర శ్రీ భద్రకాళీ మహాపీఠమునకు వెళ్ళిరి. అక్కడ స్వామి కళ్యాణానందతీర్థ

మహారాజ్ గురువుగారికి సన్యాస దీక్షను ప్రసాదించిరి. టిబెట్టు గురువులను కలసి కొనుటకు బదరీనాథ్ వెళ్ళమని వారు ఆదేశించిరి. అచట మహాగురువులఅశరీరవాణి వీరికి వినిపించునని, వారి సందేశము లభ్యమగుననిరి. ఆ తరువాత **"పరమహంస పరివ్రాజకాచార్య స్వామి స్వప్రకాశానంద తీర్థ"** అను దీక్ష నామమును స్వీకరించిరి. ఇపుడు వారి సూక్ష్మశరీరము శీతోష్ణములు, గ్రీష్మహేమంతములు, చీకటి వెలుగులు నుండి విముక్తి నొందినది. ఒకసారి అత్యుత్తమ ఆత్మ జ్ఞాన సాక్షాత్కారమైన పిమ్మట, సంసారిక పాశములు పటాపంచములయినవి. మనస్సుని తమ దేహమునందున్న నిగూఢ చక్రముపై కేంద్రీకరించి, తమ శ్వాసను నియత్రించి, వారు శ్రీమహావిష్ణువుని ధ్యానించిరి. అక్షరాల తమ భౌతిక మానసిక కాయకష్టములను జయించిరి.

1982 లో గురువుగారు కేదార్‌నాథ్ వెళ్ళిరి. అక్కడ అవధూత ఆశ్రమవాసమును స్వీకరించిరి. వారు సిద్ధ పురుషులు గురువులు తో సంభాషించకలిగియుండిరి. ఈ అనుభవములు కొన్నింటిని వారి శిష్యులతో పంచుకొనిరి. తమను వారు "అవధూత" అని మాత్రమే నిర్దేశించుకొనుచుండిరి. పసిపిల్లవాని వలె అమ్మవారి చేతిని పట్టుకొని నడుస్తూ, సకలమంత్ర, తంత్ర యంత్ర పరిజ్ఞానమును, అష్టాదశ విద్యలను తమ స్వాధీనములోనికి తెచ్చుకొనిరి. యజ్ఞహోమాదుల నిర్వహణ,

అరిషడ్వర్గములను జయించుట ఒక మహాయజ్ఞమునకు సమతుల్యమైనవి. తత్ఫలితముగా వీరు పరమహంసావధూతలు అయిరి.

అత్యధిక సమయం ధ్యాన మనన నిమగ్నులై ఉండెడివారు. శిష్యులు తమని సందర్శించినపుడు వారి యోగ క్షేమములను విచారించేడివారు. వారి సందేహములను నివృత్తి చేసెడివారు. కాని అంతసేపు వారి చురుకైన వేళ్ళు కూర్చున చెక్క మంచము మీద ఢమరుక శబ్దము చేయుచుండెడివి. అనగా వారి మనస్సు నందు పరిసరములతో సంబంధము లేకుండ, నిరంతర ధ్యానము (అజపాజప) కొనసాగుతున్నదని సంకేతము.

1985లో దత్త పాదుకలను దర్శించి పూజించుటకు కొందరి శిష్యులతో గురువుగారు గిరినారు వెళ్ళిరి. అప్పటికి వారి యోగసాధన చిన్న విత్తనము నుంచి శాఖోపశాఖలుగా విస్తరించిన మహా వటవృక్షమువలె పెరిగినది. 1993-94 మధ్య వారి గురువుల పూర్వ ఆదేశానుసారము బదరీనాథ్‌కు వెళ్ళిరి. తమకు గురువాణి వినబడనిచో అచటనే (బదరీనాథ్‌లో) దేహమును త్యజించెదనని నిశ్చయించిరి. అనుగ్రహించిన వారి గురువాణి తమ సిద్ధులను ప్రదర్శించవలదని అధిక శిష్యబృందము కూడదని హెచ్చరించి, వారు సాధనలను పరిపూర్తి చేసిన వెంటనే తన నిజదర్శనమీయగలనని, పరంజ్యోతిలో లీనమగుటకు సహాయము

చేయగలనని గురువుగారికి మాట యిచ్చినది. అనంతరము శ్రీ గురుదేవులు తమ అఖండ సాధనతో జీవాత్మ పరమాత్మైక్య ఏకత్వ పరిపూర్ణత్వమును పొందిరి.

గురువుగారు బేతాళ సాధన చేస్తున్న కాలములో ఒకసారి బేతాళుడు వారి ముందర ప్రత్యక్షమయ్యారు. "నువ్వు ఎవరు? ఎందుకు వచ్చావు"? అని గురువుగారు వారిని ప్రశ్నించిరి. "మీరు మంత్రములను స్వాధీనము చేసుకొన్నారు. కనుక మీకు సేవ చేయడానికి వచ్చాను" అని సమాధానం యిచ్చిరి. అప్పుడు గురువుగారు మీసేవ అవసరములేదని బేతాళ విమోచనమునకై జలతర్పణము చేసిరి.


మరొకసారి గురువుగారిని ఒక శిష్యుడు "తమ ముందున్న చెట్టుని మీ మంత్ర మహిమతో దహింపచేయగలరా?" అని అడిగిరి. అప్పుడు గురువుగారు "చేయగలను కాని పచ్చని చెట్టును నాశనము చేయుట తగదు" అని వెంటనే ఒక ఎండిన చెట్టును తమ మంత్ర శక్తితో దగ్ధము చేసిరి.

బౌద్ధ తత్వమును సుముఖముగా ఆదరించుటను గురువుగారు సమర్థించిరి. ఆ రీతిగా పరమత సమానత్వము పాటించి, నేటిమతాంతర అసహనమునకు పరిష్కరణ సూచించిరి.

23 జూలై 2002 మంగళవారము 5.30 సాయంత్రము చిత్రభాను నామ సంవత్సరము ఆషాడ పౌర్ణమి **"గురుపౌర్ణమి"** నాడు గోపాలపట్నము, విశాఖపట్నములో గురువుగారు మహాసమాధిపొందిరి.


గురువుగారి జీవిత చరిత్రలో కొన్ని ఘట్టములు వేదమాత శ్రీగాయిత్రి సంస్థానము, విశాఖపట్నము వారి సౌజన్యముతో చేర్చబడినవి. వారికి మాకృతజ్ఞతాభి వందనములు.

**గురుఃబ్రహ్మ గురుఃవిష్ణుః గురుర్దేవో మహేశ్వరః ।**
**గురుః సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః ॥**



# అధ్యాయము -2

# సాధన



# సాధన

సాధన అనగా ఉపాసకుడు, మంత్రము మరియు దత్తులతో మమైక్యమై ఏకత్వసిద్ధిని పొందు నియమావళి. గురుదీక్షప్రక్రియ ద్వార మనకు గురువుగారు శక్తిని ప్రసాదించిరి. సాధన చేసి పరమపదము ఎంత శీఘ్రముగా చేరెదము అన్నది మనకే విడచిపెట్టిరి. వారు మనకై తలుపులను తెరచిరి. మార్గమును చూపిరి. పూర్ణపాత్రతో సిద్ధముగా ఉండిరి. నిర్దేశిత సాధన మార్గమున పయనించి మనము సంసిద్ధులైనపుడు గురువుగారు మన అజ్ఞానదోషములను తొలగించి మనపాత్రను నింపుదురు. గురుపాదములను శరణుజొచ్చినప్పుడు అజ్ఞానులకు సైతం మోక్షములభించును.

గురువు ఉపదేశించిన మంత్రమును నిరంతరమూ జపించి మనస్సును నిగ్రహించుకొనవచ్చును. దీక్ష ఇచ్చిన గురువు ఔదార్యమువలన శిష్యులకు ఆధ్యాత్మిక మార్గము సులభమగును. గురు శ్రీచరణాలయందు ఆత్మ సమర్పణ చేసుకొనుటయే గురువు పట్ల చూపించె శ్రద్ధ మరియు వారినుండి శిష్యుడు పొందే పరిపూర్ణ ప్రేమకు మార్గము.

గురవుగారు వేదోపనిషత్తుల గూఢమైన అంతరార్థాన్ని మరియు సక్రమ సాధన మార్గమును శిష్యులకు వివరించిరి.

"మిమ్మల్ని చూసుకొనడానికి, నేను ఇక్కడ ఉన్నాను" ఇది గురువుగారి నిత్య పల్లవి. శిష్యుల సందేహములను తీర్చెడివారు. సాధన పరమైన అడ్డంకులను అధిగమించుటకు సలహాలు మరియు దృష్టాంతములను ఇచ్చెడివారు. గురువుగారు మంత్రములకాణాచి. శ్రీదత్త పాదములనుండి వారికి సప్తకోటి మంత్రములు లభించినవి. **ప్రతీ రోజు ఏకాంతముగా మనము మనస్సునందు సాధన విత్తనములను చల్లవలెనన్నది గురువుగారి ఆదేశము. ఆధ్యాత్మిక అవగాహనలో అఖండ చైతన్య సాధన ఆరోహణము నందు జపము పాదపీఠముగా, ధ్యానము సోపానమువలె ఉపకరించుకొనవలెనన్నది గురువుగారి నిర్దేశము.**

శ్రీ దత్త మానస పూజచేసెడి కాలములో, ఒక దత్త ఆలయ మందున్నపుడు, పూజ పరిసమాప్తమైన వెంటనే **"దత్తోహమస్మి"** అని గురువుగారు మూడు పర్యాయములు పలికిరి. దాని అర్థము ఏమిటని శిష్యురాలు ఒకరు వారిని అడుగగా చిన్నగా నవ్వుతూ, గంభీర స్వరముతో "దత్తుడు, నేను - ఒక్కరమే - " అని ప్రకటించిరి. ఆ క్షణములో శిష్యురాలి దృష్టికి శ్రీదత్తులుగా దర్శనమిచ్చిరి.

శ్రీ దత్త సాంప్రదాయమునందు గురువుని గుర్తించుట బహుకఠినము, అనేక పరీక్షలకు సంసిద్ధులై ఉండాలి. సర్వావస్థలందు "దత్తుడు నేను ఒక్కటే" అన్న ప్రగాఢ చింతన

ఉండాలి. గురువే సర్వస్వము అనుభావన మనస్సు నందు దృఢముగా పదిలపరచుకొని శిష్యులు గురుపాదములను ఆశ్రయించాలి. అప్పుడు మార్గము ఎంత కంటకమైననూ గమ్యము వైపునకు వెళ్ళుటకు గురుకటాక్షము, చేయూత ఉండును. ఒక్కసారి గురు అనుగ్రహము పొందిన శిష్యులు దారిద్ర్య దుఃఖ భయ భ్రాంతులనుండీ విముక్తులవుతారు.

కేవలం పుస్తకపరమైన పాండిత్యముకన్నా అనుభవైక ఆధ్యాత్మిక జ్ఞానము మహత్తరమైనది. గురు అనుగ్రహ దత్తమైన ఆత్మానుభూతి లేకుండ పూజలు, మంత్రములు, పుణ్యక్షేత్ర దర్శనములు నిష్ప్రయోజనములు. ఈ ఆత్మజ్ఞానము ఒకసారి కలిగినచో ఏక్షేత్రమునకు వెళ్ళనవసరములేదు. ఎక్కడికి వెళ్ళినా, నీవు సస్వరూపుడవై ఉందువు. అప్పుడు నీలోని ఆత్మ, విశ్వఆత్మకన్న భిన్నము కాదని, నీవే పుణ్యక్షేత్రమువని గ్రహించగలవు. తెలుగులోనుడివి నట్లు “ఏకత్వంలో అనేకం, అనేకంలో ఏకత్వం” ఇదే నిజమయిన సాధన. దీనికిమించినది ఏమియునూలేదు.

నిత్య సంసారిక విధి నిర్వహణలో మునిగిపోయిన గృహస్తు కూడ కొంత ఆధ్యాత్మిక చింతన నిరంతర అభ్యాసము చేయవలెనని గురువుగారు హెచ్చరించిరి. భేషజము, ఆర్భాటము మరియు విశేష భోగములు గాక నిరాడంబరతనే గురువుగారు

ప్రభోదించెడివారు. గురువుగారితో గడిపిన ప్రతీక్షణము వర్ణనాతీత అద్భుత అనుభవము. వారు ఏది పలికినా అది ఒక ప్రవచనము అనుగ్రహభాషణము. వారు "అచ్ఛా" అంటే మనము చేయబోవు పనులు మరియు కార్యక్రమములకు వారి ఆమోదము లభించినట్లు ఆనందాతిశయములు కలిగెడివి. తరువాత ఆ కార్యక్రమములు నిరాటంకముగా సఫలీకృతమైయ్యెడివి. శిష్యులపై గురువుగారికి గల అనంతప్రేమతో సంరక్షించు క్రమములోవారి నిరవధికత-మాటలలో చెప్పనలవి కాదు. శిష్యులకొరకు సమస్త సంబంధ బాంధవ్యములను తమలోయిముడ్చుకొనిరి. పరిధులులేని ప్రేమను కురిపించిరి. కావున శిష్యులవిశ్వాసము ఆత్మార్పణము అద్వితీయములై ఉండవలెను. గురుశిష్య అనుబంధ మహత్వమును ప్రాపంచిక వ్యవహారస్థాయికి సూక్ష్మీకరించి దిగ జార్చరాదు. గురువాక్యము వేదవాక్కుగా భావించి, గురుపాదపద్మములను శిష్యులు ఆరాధించవలెను. సదా ధ్యానించవలెను. గురుస్వరూపమును త్రికూటిలో (అనగా కనుబొమ్మలమధ్య) ధ్యానించవలెను. గురుఉపదేశిత మంత్రములను నిత్యము జపించవలెను. గురుప్రబోధ నానుసారము తు.చ. తప్పక జీవించవలెను. ఈ విధముగా ఆచరించి నపుడు గురుచైతన్యము మనలో మిళితమై మనమే చైతన్యమగుదుము.


ఈ సందర్భమున, గురువుగారు అనుగ్రహించిన అపార వాత్సల్యమును విశిష్టముగా గుర్తింపవలెను. దానికి, జన్మ జన్మాంతరములందు ఎన్ని కృతజ్ఞతాభివందనములను తెలిపినప్పటికి సమతుల్యముగావు.

గురువుగారు నడుస్తున్నపుడు వారి అడుగులసవ్వడి వినబడదని, బహుశ మలయమారుతయానలీల కావచ్చును! అని శిష్యులొకరు చలోక్తిగా వ్యాఖ్యానించిరి. వాస్తవానికి వారి పాదుకలు శిష్యులకు మోక్ష ప్రదాయక చిరు సారూప్యములు. పండితపామరులు ఎవ్వరైన గురుకృపతో తమ బుద్ధిని జోడించి సాధన చేత పరమ సత్యమును గ్రహించిన, మాయాజనిత భవసాగరమునుండి విముక్తి పొందవచ్చును- అని అవధూత గీతామృతము ఘోషించుచున్నది.

**శ్రీ గురుదేవ చరణమ్ సదా స్మరామి ।**
**శ్రీ గురుదేవ చరణమ్ సదా భజామి ।**
**శ్రీ గురుదేవ చరణమ్ సదా నమామి ।**

## అధ్యాయము - 3

# శ్రీవిద్యా ఉపాసన



# శ్రీవిద్యా ఉపాసన

శ్రీ గురుదేవులు మొదటనుండి శ్రీవిద్యా ఉపాసనలో నిష్ణాతులు. శ్రీవిద్య భగవంతుని "శ్రీమాత"గా ఆరాధించి ఉపాసించు ఒక ఆధ్యాత్మిక విధి విధానము. ఇందు దివ్య జ్ఞానము అనగా శ్రీవిద్య మరియు శ్రీమాత ఒక్కటే అను భావములో పర్యాయపదములుగా వాడబడినవి. శ్రీమధ్వాచార్య సాంప్రదాయులగు శ్రీకేశరి కామేశ్వరరావుగారు గురువుగారిని ఈ ఉపాసన మార్గమునందు ప్రవేశపెట్టిరి. ఉపనిషత్తులపై గురువుగారు సాధించిన పరిపూర్ణ పాండిత్యమునకు ఆంధ్ర విశ్వకళాపరిషత్తు (వాల్తేరు, విశాఖపట్నము) వారు గౌరవ డాక్టరేటు పట్టాను ప్రధానము చేసిరి.

దహరాకాశమునందు తమ నిరంతర హోమము జరుగుచున్నట్లు గురువుగారు సెలవిచ్చిరి. అట్టి కఠోరపూజాతపః ఫలితముగా వారు సిద్ధ శక్తులను సాధించిరి. సమస్త శక్తి సామర్థ్యములను తమ స్వాధీనములో నుంచుకొనిరి. కాని ఎన్నడు వాటిని దుర్వినియోగము చేయలేదు. శ్రీదత్తుని తమ మూలదైవముగా చేసుకొనిరి. శక్తిపూజలు, సమస్త దేవతారాధనలు, మంత్ర, యంత్ర, హోమ సారములను శ్రీగురుదత్త చరణములకు సమర్పించి ప్రసన్నతను పొంది పరిపూర్ణులైరి. పరమాత్మతో జీవాత్మైక ఏకత్వ స్థితినిపొందుటకు శ్రీదత్తునితో మమైక్యతకై సాధన చేసిరి.

ఈ సమయంలో ఆధ్యాత్మిక జ్ఞానమును ఒక నిష్ణాతుని ధృక్పథముతో గురువుగారు పరిశీలించిరి. ఆధ్యాత్మిక తత్వమును సమగ్రముగా - తంత్ర, మంత్ర, హెూమ, తప, అధ్యయనములు కాక ప్రతి ఒక్క మంత్రదేవతా శక్తి స్వరూపముల అన్ని కోణములను పరిపూర్ణముగా పరిశోధించిరి. ఈ అనుసంధానము వలన ఆత్మజ్ఞానమే నిజమయిన జ్ఞానమని ప్రామాణికముగా గురువుగారు ధృవీకరించిరి. ఈ సత్యమును **"సర్వవిద్యానాశాయ, బ్రహ్మజ్ఞానప్రసాదాయ"** అనుమంత్రముతో శ్లాఘించిరి.

గురువుగారు తమసాధనా స్వభావమును ఎన్నడు బహిర్గతము చేయలేదు. తమ శక్తి సామర్థ్యములవిరాట్ స్వరూపమును ప్రదర్శించలేదు. వారి జీవిత కాలములో **"ప్రకటో్బ్రష్టః గుప్తోముక్తః"** అను ప్రాధమిక సూత్రమును ఆచరించి సమర్ధించిరి. అటువంటి డంబాచారము తమ ఆధ్యాత్మిక ప్రగతికి అవరోధమని వారి నిశ్చయ అభిప్రాయము. ఆధ్యాత్మిక అభివృద్ధికి దోహదకారి కాదు. కావున వారు ఐచ్ఛికముగా అతి సామాన్య జీవన శైలిని అనుసరించిరి.

గురువుగారు శ్రీవిద్యా ఉపాసకులుగా చాలా సంవత్సరములు గడిపిరి. దశమహావిద్యలు అందునా శ్రీవిద్యపై వారు అపార జిజ్ఞాస ప్రావీణ్యములను కలిగి ఉండిరి. ప్రతిదినము 9/10 గంటలు నవావరణ పూజలు, తదితరపూజలను

చేయుచుండిరి. చింతామణి, వనదుర్గ మంత్రములు సిద్ధించినవి. ఆ తరుణములో వారు అనుభవించిన నిర్మలానందానుభూతిని ఈ క్రింది నామావళిలో ప్రస్తుతించిరి. "చింతామణి దత్తా త్రేయాయ, సిద్ధ చింతామణి స్వరూపాయ, చింతామణి బీజమూలాధారాయ, చింతామణి హృదయాయ, చింతామణి తంత్రప్రచురణాయ, దిగంబర అవధూతాయ, ప్రణవాధారాయ, చింతామణి కల్పవృక్ష మూలస్థితాయ, చిత్ప్రకాశాయ, అవధూతాయ, సర్వాధారాయ, మహాకౌళాయ, మూర్తిత్రయాయ, శక్తిత్రయాయ, రజఃశుక్ర ప్రభావాయ, జీవకల్పతరుమూలాయ, సర్వజీవ వ్యాప్తాయ, బిందుషట్కోణ త్రికోణ స్వరూపాయ, మహాకౌళతంత్రాయ, సర్వసిద్ధి ప్రసాదాయ, సౌః శక్తి కళాపూర్ణాయ, అణిమాద్యష్టసిద్ధి ప్రసాదాయ, ధాత్రివృక్షమూలస్థితాయ, ధాత్రితంత్ర ప్రభావాయ, మహాబిల్వతంత్రాయ, పలాశ, ఔదుంబర, అశ్వత్థ, వటవృక్ష మూలస్థితాయ, సిద్ధతంత్రాయ, సర్వమూలికా సిద్ధతంత్ర ప్రసాదాయ, చిన్ముద్రాయ, ఏకాంతాయ, షడ్భుజాయ, శంఖ కపాలపానపాత్ర ఢమరుక హస్తాయ, సమయ కౌళపూర్ణాయ, కాపాలికాయ, సర్వక్షౌద్ర వినాశాయ, శాంతాయ, క్రోధనాశనాయ, కాపాలార్చన ప్రీతాయ, చింతామణి విద్యాప్రీతాయ, చిత్శూన్యాయ, చిదానందాయ, చిత్కళాపూర్ణాయ, వేదోపనిషద్ చింతామణి విద్యాప్రకాశాయ, ఐహిక సిద్ధకల్పతరువే బ్రహ్మానందాయ, సర్వశక్తి ప్రసాదాయ, అత్రి అనసూయాత్మజాయ, సిద్ధ కల్పతరువె, చతుశ్వానాయ,

సిద్ధావతారాయ, శ్రీదత్తాత్రేయాయ నమః”

తరువాత గురువుగారు బ్రహ్మోపాసన ప్రవేశము చేసి, శ్రీదత్తులను ఈరీతిగా అభివర్ణించిరి. “ఓం ప్రణవలింగాకారాయ, బ్రహ్మైవాహాయ, బ్రహ్మైవసర్వ నామాయ, బ్రహ్మైస్వరూపాయ, ఆత్మాకారాయ, ఆత్మాధారాయ, ఆత్మయోగాయ, సర్వయోగ విసర్జనాయ, ఆత్మోపాసనసిద్ధాయ, సర్వబ్రహ్మైవభావనాయ, ద్వాదశ మహాచక్రార్చనాయ, ద్వాదశాంతసుషుమ్నాయ, సిద్ధి బ్రహ్మాణ్యాయ, ఓష్టాగ్ని జ్వాలాయ, విరాట్ రూపాయ, విశ్వవ్యాప్తాయ, బ్రహ్మస్వరూపాయ, సుషుమ్నాత్మాయ, జ్యోతిరోంకారాయ, శాంతాయ, సచ్చిదానందాయ, సాత్వికాయ, అరిషడ్వర్గనాశనాయ, ద్వన్ద్వత్యాగాయ, శివచింతామణి పాదద్వయాయ, ప్రణవాకారాయ, ప్రణవాంతర్గమ మహా వాక్యాయ, శ్రీవిద్యాయ, చిద్విద్యాయ బ్రహ్మసమ్విత్ సచ్చిదానంద లహర్యాయః.

శ్రీవిద్య మరియు మహావాక్యములను బ్రహ్మవిద్యనందు అనుసంధించి మరల శ్రీదత్తపాదుకలందు సమర్పించిరి. “సర్వాత్మ ధర్మాయ, బ్రహ్మజ్ఞాన ఆత్మావతారాయ దత్తపాదద్వయాయ నమః. ఓం శ్రీమహాత్రిపురసుందరీ, శ్రీ విద్యాపంచదశాక్షరీ, బాలాంబికా, బగళా, మాతంగీ, స్వయంవరకళ్యాణీ, భువనేశ్వరీ, చండీ, చాముండా, వారాహీ, తిరస్కరిణీ, రాజమాతంగీ, సుఖశ్యామలా, లఘుశ్యామలా, అశ్వారూఢా, ప్రత్యంగిరా, ధూమవతీ, సావిత్రీ,

గాయత్రీ, సరస్వతీ, బ్రహ్మానన్దకళాయ, ప్రణవాకారాయ, దత్త పాదద్వయాయ నమః".

ఓం జ్యోతిర్పరంజ్యోతి, అంతర్జోతిస్వరూపాయ, బ్రహ్మ జ్ఞానాయ, సర్వేంద్రియత్యాగాయ, ఆత్మాయ, బ్రహ్మాయ, విష్ణవే, నారాయణాయ, రుద్రాయ, వేదోపనిషత్ ప్రియాయ, సంసారార్ణవతారణాయ, బాహ్యేంద్రియ అంతరేంద్రియ మంత్ర యంత్ర తంత్రాయ, స్తోత్ర కవచ హృదయ పంజరస్తోత్ర, బాహ్యేంద్రియ కామ్యాయ, సర్వత్యాగాయ, ధ్యానసమాధి లయాయ, మండలతేజోస్వరూపాయ, మహాకౌళాయ, బ్రహ్మాత్మలయాయ, ప్రణవాయ, ఓంకారబీజాయ, భైరవీ చింతామణి దిగంబర దత్తాత్రేయాయ, పరమహంసాయ, మహావాక్య ఉపదేశ గురవే, మహావాక్య ప్రియాయ, మధుప్రీతాయ, సదాచారప్రియాయ, సర్వాచారత్యాగాయ, జాతి కుల మత గోత్ర వర్ణాశ్రమాచార విసర్జనాయ, బ్రహ్మజ్ఞానాయ, సిద్ధిప్రసాదాయ, సాత్వికాయ, శాంతాయ, నిష్క్రోధాయ, సృష్టి స్థితి లయాయ, అమృతపూర్ణాయ, ఆదిమధ్యాంతరహితాయ, పరమహంసాయ, సర్వపాశఛేదనాయ, పాదస్వరూపాయ, బ్రహ్మ విష్ణు మహేశ్వరాయ, మాలాప్రియాయ, లక్ష్మీ సరస్వతీ పార్వతీ స్వరూపాయ, బిల్వార్చన ప్రియాయ, బిల్వఫలబక్షణాయ, భవసాగరతారణాయ, సద్భక్త వశ్యాయ, సచ్చిదానందాయ, సాలగ్రామ మాలాధరాయ, అభిషేకప్రియాయ, శివ చింతామణి దత్తాత్రేయాయనమః.

ఆ క్రమములో శ్రీవిద్యాతత్వమును మహావాక్యము నందు కూర్చిరి. దానిని బ్రహ్మాత్మైక ఏకత్వమును, పరమోత్కృష్ట దత్తపాదుకులను చేర్చు బ్రహ్మోపాసన గా మలచిరి. వాటిని శ్రీదత్తాత్రేయుల చరణములవద్ద సమర్పించిరి.

ఆశ్చర్యపరచే ఒక విషయము ఇక్కడ ప్రస్తావించవలసి ఉన్నది. పైన ఉదహరింబడిన మంత్రములు, తదితర అనేక మహిమాన్విత మంత్రరాజములు మరియు శ్రీదత్తుల విస్తార నామావళి గురువుగారికి వారి సమస్త గురువులచే తెలియచేయబడినవి. ఈ మంత్రములు ఇంతకు ముందెన్నడును విన్నవి కన్నవి కావు. అనేక పర్యాయములు రాత్రి సమయములందు గురువుగారి గది నుండి వచ్చు కంఠధ్వనులను ప్రక్కగదిలోని వారు వినుట సంభవించినది.


గురువుగారికి మంత్ర దర్శనమును చేయించిన కొందరి పరమగురువులు, మంత్రద్రష్టలపేర్లు : శ్వేతకేతు, రుభు, నిధాగ, జడభరత, రుషభ, దూర్వాస, సంవర్తక సనత్సుజాత, వైదేహ, వటసిద్ధ, శుక, వామదేవ, దత్తాత్రేయ, రైవతక, గోరక్షావధూత మొ॥వారు.

**సత్యజ్ఞానానందమయి మా । అద్వయబ్రహ్మసనాతని మా ।**
**శ్రీ గురురూపిణి కృపామయి మా । సద్గురురూపిణి కృపామయి మా ।**



# అధ్యాయము -4

# అవధూత



# అవధూత

స్వామి విద్యారణ్యులవారు "వేదాంత పంచదశి"లో తృప్తి దీపప్రకాశనంలో అవధూత స్థితిని వర్ణించిరి. ఆత్మానుభవంలో (ఆత్మసందర్శనంలో) పరాకాష్టస్థితిలో వున్నప్రత్యేక వ్యక్తి అవధూత. ఈ స్థితిలో వ్యక్తి ఏ విధమైన కోరికలచేతగాని, వాంఛ (ఇచ్ఛ)లచేతగాని చలించని (అంటే బాహ్య, మానసిక విషయ వాంఛలతో సంబంధములేని) అనిర్వచనీయమైన తృప్తిని పొందుతాడు. "అవధూతోపనిషత్తు 108 ఉపనిషత్తులలో ఒకటి. శ్రీ విద్యారణ్యులవారి అవధూతస్థితి వర్ణన దాన్నియధాతథంగా అనుసరించింది.

సంస్కృతంలో "అవధూలం" అంటే విసర్జనం. అంచేత "అవధూత" అంటే అన్నివాంఛలనూ వాసనలనూ విసర్జించిన వాడు అని అర్థం వచ్చింది. అవధూత తాను కృతకృత్యుడునని తెలుసుకుంటాడు. తాను చెయ్యవలసిందేమీ లేదు. అందుచేత అతడు కర్మలమీద ఏకోరికా సంకల్పమూ లేకుండా అమందానందం (బ్రహ్మానందం)లో మునిగి వుంటాడు.

అతడు దేన్ని సాధించాలో దాన్ని సాధించినసిద్ధుడు. అతడు సాధక స్థితిని అధిగమించే వున్నాడు. కనుక సాధనతో పనిలేదు. అతడు కర్మమార్గంగాని భక్తి మార్గంగాని, కొసకి జ్ఞానమార్గంగాని అనుసరిస్తున్నాడని ఎవరూ చెప్పడానికి లేదు. కర్మ మార్గాన్ని

అనుసరించేవారు ఇహంలో ఆనందమయ జీవితంగడిపి, పరంలో ఇంకా ఆనందమయ జీవితం గడపాలని కోరుకుంటారు. దీని కోసమని వేదాలలో సూచించిన విధంగా అన్ని కర్మల్నీ ఆచరిస్తూ వుంటారు. కాని ఇది జనన మరణ భ్రమణంలో తిరిగే సంసార మార్గం. భక్తి మార్గాన్ని అనుసరించేవారు ఒక దేవతను కోరి, భక్తి ప్రేమలతో ఆదేవతను ఆరాధించి, ఆ దేవతా స్థావరాన్ని మరణానంతరం చేరుకోవాలని అభిలషిస్తారు. దీనిని సగుణభక్తి అంటారు. సగుణ భక్తి తాద్యాత్మ్యానికి తీసుకుపోయే నిర్గుణ భక్తిగా మారితే తప్ప, ఈ మార్గం పరిధి పరిమితం.

శాస్త్రాలలో చివరి పురుషార్థంగా సూచించబడిన మోక్షాన్ని సాధించడానికి సూటి అయింది జ్ఞాన మార్గం. దీనిలో ఆత్మ సత్యాన్ని దర్శించడమే ధ్యేయం. తాను తప్ప మరేదీ లేనిదీ, సర్వ జగత్తు అసత్యమైన మాయావిభూతిగా గ్రహింప జేసేదీ, అయిన సచ్చిదానంద స్వరూపాను భవమే ధ్యేయంగా గలదే జ్ఞాన మార్గసాధన.

వేదాలలో శాసించబడిన కర్మ కాండలన్నీ కర్మ మార్గంలో భాగమే గాని, జ్ఞానమార్గంలోనివి కావని భావించబడుతున్నాయి. వేదానుసారమైన కర్మకాండలో శారీరక సంబంధమైన మంత్రోచ్చారణ వున్నప్పటికీ మానసిక ధ్యానమే అధిగమిస్తుంది. కాని వీటిలో ఒకానొక సిద్ధిగాని శక్తిగాని సాధించడమే ధ్యేయం

గనుక, ఇది సంసార బంధంలో భాగమే. ఈ సంసార బంధం నుంచి ముక్తి పొందాలన్న తపనే 'ముముక్షత్వం' అంటారు. ఈ తపన ఫలత్వం పొందడానికి ఉపనిషత్తులలో జ్ఞాన మార్గం సూచించబడింది. ఉపనిషత్తులు వేదాలకి మకుట భాగములు.

ముక్తిని పొందడానికి శ్రవణం, మననం, నిధి ధ్యాసనం అనే మూడు మార్గాలు సూచించబడ్డాయి.

1. సద్గురువు చెప్పగా, అచంచలదృష్టితో ఉపనిషత్తు(ల) సందేశం వినడం శ్రవణం.
2. విన్న దాన్ని సరియైన తర్కంతో విమర్శించి, సత్యాన్ని గ్రహించడానికి మానసిక మథనం చెయ్యడం మననం.
3. ఆ సత్యాన్ని దృష్టిలో వుంచుకుని తపస్సు ద్వారా ఆ సత్యంతో తాద్యాత్మ్యం చెందడం నిధి ధ్యాసనం.

పై మూడు మార్గాలను అనుసరిస్తున్నంత కాలం, వ్యక్తి సాధకుడవుతాడు. సాధకుడు సత్యంతో తాద్యాత్మ్యం పొందే సమయం వస్తుంది. అప్పుడు అతనింక వెనుదిరగవలసిన పనిలేదు. తానే 'సత్' స్వరూపుడు. ఇది అవధూతావస్థ. (దీనిని శ్రీ అంబటిపూడి కొండయ్య శాస్త్రిగారు విజయవాడలో తమ ఉపన్యాసంలో వివరించారు.)

అవధూతావస్థలో విచిత్రం ఏమిటంటే, అవధూత తాను ఏ సాధనలద్వారా ఆస్థితిని సాధించేవాడో, ఆ సాధనలను కూడా

అధిగమించి వుంటాడు. అతడికి ఆస్థితినుండి వెనక్కు జారే అవకాశం లేదు గనక, అతడికి ఏ సాధనతోనూ పనిలేదు. చివరకు తపస్సు కూడా అవసరం లేదు. తపస్సు యొక్క ధ్యేయం అవధూతావస్థేగనుక.

ఇంకో విషయం ఏమిటంటే అవధూత తాను ఈ సాధనలన్నీ ఈ జన్మలోనే చేయనక్కరలేదు. గత జన్మలో అన్ని సాధనలూ చేయగా, కొంచెం భాగం మాత్రం ఈ జన్మకి మిగిలి వుండవచ్చు. ఈ స్థితిలో ఆ కొద్ది సాధనా అసంకల్పితంగానే జరిగిపోతుంది. విదేహముక్తి తాలూకు లక్షణాలన్నీ అవధూతలో వుంటాయి. అంత రంగికంగా దేహంతో అన్ని బంధాలూ ఒదులుకుని వుంటాడు. గత జన్మలో మిగిలిన కర్మ ఫలాలను అనుభవించడానికి గానూ ఈ శరీరంతో జీవన్ముక్తుడు గా వుంటాడు.

దేహంలో వున్నా తాను ముక్తుడే – తన అనుభవంలో తనకూ దేహానికీ ఏవిధమైన సంబంధమూ లేదు. ప్రారబ్ధ కర్మననుసరించి, శరీరం వివిధ అనుభవాలను పొందుతూ వుంటుంది. అవధూత వాటికి ఏ ఆటంకమూ కలగనివ్వకుండా, శరీరాన్ని ఆ అనుభవాలు పొందనిస్తాడు. తాను మాత్రం దేహ సంబంధమైన సుఖదుఃఖాలకు అతీతుడుగా ఏ సంబంధమూ లేకుండా వుంటాడు. ప్రారబ్ధ కర్మననుసరించి ఒకసారి గొప్ప భోగములను భవించవచ్చు. మరొకసారి దుర్భర కష్టములను భవించవచ్చు. అవధూత

ఆరెండింటినీ సమదృష్టితో చూస్తూ వుంటాడు. ఇతరులకు మాత్రం అతడు మామూలు వ్యక్తిలాగే కష్ట సుఖాలలో మునిగి వున్నట్టు కనబడతాడు.

సుఖ దుఃఖాలను అనుభవింప జేసే ప్రారబ్ధ కర్మరీతులు చిత్రమైనవి. సంస్కృతంలో వీటిని సుఖ ప్రారబ్ధం, దుఃఖ ప్రారబ్ధం అంటారు. వీటిని పూర్తిగా అనుభవించడం వల్లనే ఈ ప్రారబ్ధాలు నశిస్తాయి. తను కాక, కేవలం తన శరీరం మాత్రమే ఈ అనభవాలను పొందుతుందని పూర్తిగా తెలిసిన వాడు గనక, అవధూత కష్టసుఖాలను ఎదుర్కొడానికి జంకడు.

గత సంస్కారములుగాని, వాసనలు గాని ప్రారబ్ధకర్మలో మిగిలివుంటే అవి మనఃక్లేశాన్ని కలిగించవచ్చు. కాని తాను వాటికన్నా వేరుగనక ఆత్మ జ్ఞాన ఫలితమైన బ్రహ్మానందంలో మునిగి వుంటాడు అవధూత అతడు తిరిగి సంసార బంధంలో చిక్కుకునే ప్రసక్తే లేదు.

ఈ స్థితిలో అవధూతని 'బ్రహ్మవిద్ వరిష్ట' అంటారు. – అంటే బ్రహ్మ ను తెలుసుకున్నవారిలో అగ్రగణ్యుడు. అంతరంగ, బహిరంగాలలో ఏకత్వాన్ని చూడడమే ఈస్థితి లక్షణం. తన కళ్ళముందు వున్న దంతా మాయ వలన కల్పించబడినవి విభూతులు మాత్రమే.


వేదాంత శాస్త్రం సర్వ సృష్టినీ రెండింటికింద విభజించింది. దృక్, దృశ్యము - చూసేశక్తి, చూడబడేది. దృక్ (దృష్టి)లో జ్ఞానం వుంది. చూసిన దానిని గ్రహించేజ్ఞానం. ఇది త్రిపుటి ( మూడు భాగాలుగా) వుంటుంది.

1. తెలుసుకునేవాడు (జ్ఞాత) 2. తెలుసుకోవడం (జ్ఞానము) 3. తెలియ బడేది (జ్ఞేయము) కాని చివరిలో జ్ఞానం (తెలుసుకోవడం) మాత్రం మిగులుతుంది.- జ్ఞేయంలేకపోయినా సరే- కాంతి ఇవ్వడానికి ఏదీ లేకపోయినా తాను మాత్రం వెలుగుతూ వున్న జ్యోతిలాగ (స్వప్రకాశా!).

జ్ఞాత, జ్ఞానములలో జ్ఞానము - అంటే తన కన్న వేరుగా ఏదిలేదో, మిగిలిన వన్నీ ఏవిధంగా అస్థిరమైన మాయా విభూతులో గ్రహించిన బ్రహ్మ జ్ఞానం (అహంబ్రహ్మాస్మి) - మాత్రమే సత్యమని వేదాంత శాస్త్రం చివరిలో తేల్చి చెప్పింది.


అవధూత తాను ఆ సత్యంతో తాదాత్మ్యం చెంది, జీవితంలో అన్ని పరిస్థితులలోనూ అచంచలమైన ఆనందంలో మునిగివుంటాడు.

**అవధూత చిన్తనమ్ శ్రీ గురుదేవ దత్త ।**



## అధ్యాయము -5

# దత్తపాదద్వయ నామావళి



# దత్తపాదద్వయ నామావళి

గురువుగారు తమ జీవితకాలములో అనుష్టించిన అనేక మంత్ర మాలికలను దత్తపాదములయందు చేర్చిరి. సువర్ణాక్షరములతో లిఖింప తగిన "**గురుదత్త పాదా ద్వయాయనమః**" అనుదివ్య నామావళి వారు అనుగ్రహించిన మహాప్రసాదము.

॥ శ్రీ ॥

ఓం గురుదత్తాత్రేయాయ పాదద్వయాయ నమః

ఓం పాదద్వయాయ దత్తాత్రేయాయ నమః

ఓం సచ్ఛిదానందాయ నమః

ఓం మండలత్రయాయ పాదప్రకాశాయ నమః

ఓం వేదపాదాయ నమః

ఓం ఉపనిషత్ తత్వ పాదాయ నమః

ఓం సర్వమంత్ర యంత్ర తంత్ర పాదాయ నమః

ఓం సర్వ శక్తి స్వరూపాయ నమః

ఓం చిత్ ప్రకాశాయ నమః

ఓం చిదానందాయ నమః

ఓం చిదగ్ని ప్రకాశాయ నమః

ఓం సర్వదేవతా సేవితాయ నమః

ఓం సనకాది సిద్ధసేవిత ప్రియాయ నమః

ఓం సర్వ వ్యాప్తాయ నమః

ఓం సప్తర్షి పూజిత సంతుష్టాయ నమః

ఓం నవనాథ సిద్ధ సేవిత ప్రియాయ నమః

ఓం నాద బిందు కళా పూర్ణాయ నమః

ఓం ఆత్మ స్వరూపాయ నమః

ఓం ఆత్మ బిందు మయాయ నమః

ఓం ఆత్మానందాయ నమః

ఓం ఆత్మ ధ్యాన, ఆత్మ సమాధి ఆత్మలయ ప్రకాశాయ నమః

ఓం ఆత్మ విద్యా పూర్ణ సిద్ధ పాద ద్వయాయ నమః

ఓం అద్వైతామృతరస ప్రసాదాయ నమః

ఓం ఆత్మ పాద ద్వయ స్వరూపాయ నమః

ఓం పాదద్వయ ప్రణవాయ నమః

ఓం నిగమాగమ పాద ద్వయాయ నమః

ఓం జ్ఞానవైరాగ్య పాదాయ నమః

ఓం శాంతాత్మపాదాయ నమః

ఓం అగ్ని త్రయ వేదత్రయ యోగత్రయ శక్తి త్రయ మూర్తి త్రయ బీజ త్రయ పాద ద్వయాయ నమః

ఓం సర్వ స్తంభనాయ నమః

ఓం సిద్ధ పాద ద్వయాయ నమః

ఓం హృదయ స్థితాయ నమః

ఓం భృవోర్‌మధ్య స్థితాయ నమః

ఓం మూర్ధి స్థితాయ నమః

ఓం సర్వమూలాధార పాదద్వయాయ నమః

ఓం అఖండ జ్యోతి ప్రకాశ ప్రభావ పాదద్వయాయ నమః

ఓం అఖండ సిద్ధపాదద్వయాయ నమః

ఓం కౌళప్రియాయ నమః

ఓం గురుత్రయ పాదాయ నమః

ఓం నిర్గుణ పాదాయ నమః

ఓం నిరంజన పాదాయ నమః

ఓం నిర్మలపాదాయ నమః

ఓం నిర్వికార పాదాయ నమః

ఓం నిశ్చింతాయ నమః

ఓం నిరుపమానాయ నమః

ఓం సర్వాతీత పాదాయ నమః

ఓం శ్రీ గురు దత్తాత్రేయాయ పాదద్వయాయ నమః

ఓం సప్తర్షి సిద్ధ పూజితాయ నమః

ఓం యోగా ధారాయ నమః

ఓం అద్వైతామృత పాదాయ నమః

ఓం నామరూపవిహీనాయ నమః

ఓం నిరాహారాయ నమః

ఓం జ్యోతిర్త్రయ ప్రకాశాయ నమః

ఓం నాదబిందు కళాపూర్ణాయ నమః

ఓం సర్వాకార విసర్జనాయ నమః

ఓం నిరాకారాయ నమః

ఓం సర్వాధారాయ నమః

ఓం పురుషప్రకృతి స్వరూపాయ నమః

ఓం ప్రణవాకారాయ నమః

ఓం సర్వ బీజ మూలాధారాయ నమః

ఓం అకారాదిక్షకారాంత స్వరూపాయ నమః

ఓం సర్వాత్మప్రకాశాయ నమః

ఓం సాలగ్రామ ప్రియాయ నమః

ఓం సర్వవశ్యాకర్షణాయ నమః

ఓం సర్వ క్రీడా విసర్జనాయ నమః

ఓం గుణాతీతాయ నమః

ఓం తురీయ తురీయాతీతాయ మూలాధారాయ నమః

ఓం బ్రహ్మ జ్ఞాన స్వరూపాయ నమః

ఓం బాహ్యాంతర వ్యాప్తాయ నమః

ఓం కౌళాయ నమః

ఓం కులార్ణవ తంత్రా ధారాయ నమః

ఓం శ్రీదత్తాత్రేయ పాద ద్వయాయ నమః

ఓం దత్త పాదద్వయాయ నమః

ఓం సిద్ధసేవితాయ నమః

ఓం జ్ఞానవైరాగ్యపాదాయ నమః

ఓం సర్వయోగ పాదాయ నమః

ఓం సర్వవేదోపనిషత్ పాదాయ నమః

ఓం సర్వమంత్ర యంత్ర తంత్రపాదాయ నమః

ఓం శాంత పాదాయ నమః

ఓం సాత్విక పాదాయ నమః

ఓం సత్యధర్మపాదాయ నమః

ఓం సర్వామృతప్రసాద పాదాయ నమః

ఓం నిర్వాణ నిర్గుణ నిర్మలనిశ్చలసిద్ధపాదాయ నమః

ఓం తత్త్వామృత పాదాయ నమః

ఓం నిగమాగమ పాదాయ నమః

ఓం సర్వ వ్యాప్త పాదాయ నమః

ఓం సర్వ శాస్త్ర సార పాదాయ నమః

ఓం ప్రాణ పంచక, భూత పంచక, వేదత్రయ, అగ్నిత్రయ, గుణత్రయ, మండల త్రయ, గ్రహరాశి నక్షత్ర, సృష్టి స్థితి లయ, విద్యుత్ మండలప్రకాశ ప్రభావాయ నమః

ఓం షోడశకళ, చతుషష్ఠీకళ, షణ్ణవతీ కళాపూర్ణపాదాయ నమః

ఓం చతుర్దశ భువన వ్యాప్తాయ నమః

ఓం మూర్తి త్రయ, శక్తి త్రయ పాదాయ నమః

ఓం దేవ యక్ష యక్షిణీ భైరవ భైరవీ సేవిత పాదాయ నమః

ఓం నిరంజనపాదాయ నమః

ఓం సర్వకామ్య సిద్ధి ప్రసాదాయ నమః

ఓం సర్వాధారాయ నమః

ఓం నిరాధారాయ నమః

ఓం నిర్వికారాయ నమః

ఓం జనన మరణ ప్రవాహరహితాయ నమః

ఓం సర్వ భవనాశనాయ నమః

ఓం సదాపాదద్వయామృత ప్రసాదాయ నమః

ఓం కులార్ణవ తంత్రార్చన ప్రీతాయ నమః

ఓం సర్వనదీ తీర్థక్షేత్రపాదద్వయ ప్రకాశాయ నమః

ఓం సప్త కోటి మహామంత్ర దేవతా స్వరూపపాదాయ నమః

ఓం రహాస్యాతిరహస్య పాదద్వయ ప్రభావప్రకాశాయ నమః

ఓం జీవన్మక్తి ప్రసాదాయ నమః

ఓం బ్రహ్మామృత పానాసక్త ప్రసాదపాదాయ నమః

ఓం సదా బ్రహ్మ జ్ఞాన సిద్ధాయ నమః

ఓం సచ్చిదానందాయ నమః

ఓం స్థిర సిద్ధి ప్రసాదాయ నమః

ఓం యోగ త్రయ మూలాధారాయ నమః

ఓం యోగపాదాయ నమః

ఓం జ్యోతిర్త్రయాయ నమః

ఓం ఆత్మజ్యోతి ప్రకాశాయ నమః

ఓం ఆత్మావతారాయ నమః

ఓం బాహ్యాంతర ఆత్మ ప్రకాశాయ నమః

ఓం రుధిరాస్తి శల్య మజ్జ శుక్రధాతు శూన్యాయ నమః

ఓం ఆత్మపూర్ణ పాదద్వయాయ నమః

ఓం స్వవ్యాప్త వ్యక్తాయ నమః

ఓం నిరాధారాయ నమః

ఓం సర్వాధారాయ నమః

ఓం బీజ త్రయాయ నమః

ఓం ప్రణవాధారాయ నమః

ఓం ప్రణవాకారాయ నమః

ఓం ధ్యాన సమాధి లయ శూన్యాయ నమః

ఓం సర్వ సమాధి సిద్ధాయ నమః

ఓం ప్రస్థాన త్రయ స్వరూపాయ నమః

ఓం సర్వపారాయణ ప్రీతాయ నమః

ఓం బాహ్యాంతరార్చన ప్రీతాయ నమః

ఓం సర్వోపనిషత్ తత్త్వస్వరూపాయ నమః

ఓం వేదామ్నాయ ప్రీతాయ నమః

ఓం సర్వత్యాగాయ నమః

ఓం సదాచారాయ నమః

ఓం దురాచార ఖండనాయ నమః

ఓం అభేద నాశనాయ నమః

ఓం అంతః శౌచ్య పూర్ణాయ నమః

ఓం బాహ్యాశౌచ్య విసర్జనాయ నమః

ఓం జ్యోతి స్వరూపాయ నమః

ఓం జ్యోతిర్ కళా పూర్ణాయ నమః

ఓం శ్రీదత్త పాద ద్వయాయ నమః

ఓం ఓంకారాయ నమః

ఓం శ్రీవిద్యా శక్తి విద్యా స్వరూపాయ నమః

ఓం సిద్ధాకర్షణాయ నమః

ఓం మోషితాకర్షణాయ నమః

ఓం ఇంద్రాద్యష్ట దిక్పాలకాకర్షణాయ నమః

ఓం అమృతాకర్షణాయ నమః

ఓం నాగాకర్షణాయ నమః

ఓం సర్వ యక్షిణ్యాకర్షణాయ నమః

ఓం సిద్ధశాబర దేవశాబర మహామంత్రాన్యాకర్షణాయనమః

ఓం దివ్య పాదద్వయాయ నయః

ఓం తురీయాతీతాకర్షణాయ నమః

ఓం నిరాహారాయ నమః

ఓం సర్వాహార ప్రియాయ నమః

ఓం సనక సనందన సనత్సుజాత సనత్ కుమార పూజిత ప్రియాయ నమ:

ఓం కపిల, వామదేవ, సాంఘ్మృతి, సంవర్తక, ఋభు, నిదాఘు, శాండిల్య, అధర్వణ సేవా సంతుష్టాయ నమః

ఓం గాయత్రీ ప్రియాయ నమః

ఓం గానలోలాయ నమః

ఓం సర్వాస్త్ర సిద్ధాయ నమః

ఓం శస్త్ర ప్రియాయ నమః

ఓం సర్వక్షౌద్రికాది వినాశనాయ నమః

ఓం బ్రహ్మప్రణవస్వరూప పాదాయ నమః

ఓం సర్వాతీతాయ నమః

ఓం నిర్ద్వంద్వాయ నమః

ఓం నియమానియమ విసర్జనాయ నమః

ఓం బాహ్యే తీర్థ విసర్జనాయ నమః

ఓం అంతస్తీర్థ ప్రసాద సిద్ధాయ నమః

ఓం బాహ్యేంద్రియాంతరింద్రియ ధర్మత్యాగాయ నమః

ఓం ఆత్మజ్యోతి పాదద్వయాయ నమః

ఓం విశ్వ వ్యాప్త పాదద్వయాయ నమః

ఓం సప్తర్షిసేవిత ప్రియాయ నమః

ఓం నైమిశారణ్య స్థితాయ నమః

ఓం బదరికావనస్థితాయ నమః

ఓం నారాయణ సేవిత ప్రియాయ నమః

ఓం నారద పూజిత ప్రియాయ నమః

ఓం నవనాథ సిద్ధ సేవితాయ నమః

ఓం దత్తపాదద్వయ సిద్ధ పూజితాయ నమః

ఓం సర్వదారిద్య నిర్మూలనాయ నమః

ఓం సర్వనవనిధి నిక్షేపప్రసాదాయ నమః

ఓం వాక్ సిద్ధి ప్రసాదాయ నమః

ఓం దృష్టి సిద్ధి ప్రసాదాయ నమః

ఓం సర్వ దీక్షాసిద్ధి ప్రసాదాయ నమః

ఓం పరివ్రాజక ప్రియాయ నమః

ఓం పరమహంస స్వరూపాయ నమః

ఓం అవధూత దిగంబర సేవాప్రీతాయ నమః

ఓం విద్యుత్ జ్యోతి ప్రభావ ప్రకాశాయ నమః

ఓం వేదోపనిషత్ పాదద్వయ వ్యాప్తాయ నమః

ఓం బ్రహ్మాత్మజ్ఞాన పూర్ణాయ నమః

ఓం అకార ఉకార మకార కళాపూర్ణాయ నమః

ఓం అత్రి అనసూయా జ్యోతి ప్రభావప్రకాశ పూర్ణాయ నమః

ఓం శ్రీదత్తాత్రేయ పాద ద్వయాయ నమః

ఓం నమో భగవతే దత్తా త్రేయ పాద ద్వయాయ నమః

ఓం సిద్ధ పాదాయ నమః

ఓం యోగ పాదాయ నమః

ఓం జ్ఞాన పాదాయ నమః

ఓం ధ్యాన పాదాయ నమః

ఓం సమాధి పాదాయ నమః

ఓం మూర్తి త్రయ శక్తి త్రయపాదాయ నమః

ఓం సర్వ జీవ వ్యాప్త పాదాయ నమః

ఓం సర్వానందపాదాయ నమః

ఓం గ్రహనక్షత్ర రాశిమండలత్రయ భూత పంచక
ప్రాణ పంచక యోగత్రయ వేదత్రయ ఉపనిషత్
పాదాయ నమః

ఓం గుణ త్రయ పాదాయ నమః

ఓం సర్వ ద్వంద్వాది నిర్మూలనాయ నమః

ఓం అమృత పూర్ణాయ నమః

ఓం అమృత ప్రసాదాయ నమః

ఓం హంస పరమహంసావధూతాయ నమః

ఓం దిగంబర అతివర్ణామి పాదవ్యాప్తాయ నమః

ఓం తురీయా తీత పాదాయ నమః

ఓం ఆత్మామృత పాన తృప్తిపాదాయ నమః

ఓం నిష్కామాయ నమః

ఓం నిర్గుణ పాదాయ నమః

ఓం సర్వాతీతాయ నమః

ఓం పాదుకా మహాపాదుకా స్వరూపాయ నమః

ఓం కులార్ణవ తంత్ర పూర్ణపాదాయ నమః

ఓం సర్వ బాహ్యా విసర్జ నాయ నమః

ఓం నిరాధారాయ నమః

ఓం నిరాకారాయ నమః

ఓం నిరుపమానాయ నమః

ఓం నిర్వికారాయ నమః

ఓం సిద్ధ ఋషి మానస సంచార పాదాయ నమః

ఓం జనన మరణ రహితాయ నమః

ఓం సర్వ వర్ణ రహితాయ నమః

ఓం ఉపనిషత్ ఆత్మామృత రసపాన పాదాయ నమః

ఓం ఉపదేశ విహీనాయ నమః

ఓం ఉపదేశ కర్తాయ నమః

ఓం ఆత్మోప దేశ సిద్ధి ప్రసాదాయ నమః

ఓం ఆత్మాకారాయ నమః

ఓం ఆత్మ పూర్ణాయ నమః

ఓం ఆత్మాలంకార ప్రియాయ నమః

ఓం ఆత్మ జ్యోతి స్వరూపాయ నమః

ఓం అకారాది క్షకారాంత మాతృకా బీజ వర్ణాకార స్వరూపాయ నమః

ఓం సర్వ జ్యోతి పూర్ణాయ నమః

ఓం పురుష ప్రకృతి స్వరూప పాదాయ నమః

ఓం సర్వాహంకార విసర్జనాయ నమః

ఓం శాంతాయ నమః

ఓం మహోమతన్యదృష్టాంత ప్రబోధపాదాయ నమః

ఓం సర్వకర్మ నిర్మూలనాయ నమః

ఓం ధర్మ పూర్ణాయ నమః

ఓం సర్వాధారాయ నమః

ఓం వేదోపనిషత్ ధర్మ సత్కర్మ ఉపదేశ నిష్ఠాసదాచార పూర్ణాయ నమః

ఓం సర్వ విసర్జనాయ నమః

ఓం స్నాన పానాయ నమః

ఓం స్నానపాన త్యాగాయ నమః

ఓం వేదోపనిషత్ విహారాయ నమః

ఓం వనమాలా ధరాయ నమః

ఓం తులసీ మాలాధర ప్రీతాయ నమః

ఓం తులసీదళ పూజాప్రియాయ నమః

ఓం బిల్వదళ మాలా సంతుష్టాయ నమః

ఓం బిల్వార్చన ప్రియాయ నమః

ఓం బిందుపాదాయ నమః

ఓం బిందు కళాపూర్ణాయ నమః

ఓం బిందుజ్యోతి పూర్ణ ప్రకాశాయ నమః

ఓం బిందుపాద ద్వయాయ నమః

ఓం బైందవస్థితాయ నమః

ఓం బైందవాంతర్గత ద్వాదశజ్యోతి ప్రకాశ ప్రభావ
పాదాయ నమః

ఓం హృద్ పద్మ ప్రభావ ప్రకాశాయ నమః

ఓం హృద్ పద్మవికసిత మధ్యస్థితాయ నమః

ఓం పద్మకమలపూర్ణదాయ నమః

ఓం పద్మ కమలపూర్ణ పాదాయ నమః

ఓం సద్భక్త హృదయ స్థిత సంచారాయ నమః

ఓం బ్రహ్మ విష్ణు మహేశ్వర రమావాణి ఉమా
స్వరూపపాదాయ నమః

ఓం అనసూయ హృద్ పద్మస్థిత ప్రకాశ ప్రభావాయ నమః

ఓం అత్రి ధ్యాన సమాధి స్థిత ప్రకాశ ప్రభావ
పాదద్వయాయ నమః

ఓం శ్రీ దత్తాత్రేయ పాదద్వయాయ నమః

ఓం సర్వ విశ్వ కమలమధ్య స్థిత వ్యాప్త ప్రకాశ
ప్రభావాయ నమః

ఓం అధర్వణ వేద ప్రియాయ నమః

ఓం వేద పద్మకమలమధ్య స్థితాయ నమః

ఓం ఉపనిషత్ పద్మకమలపూర్ణానందాయ నమః

ఓం సర్వాతీతాయ నమః

ఓం శ్రీ దత్తాత్రేయ పాదద్వయాయ నమః

ఓం శ్రీ శివ చింతామణి కామధేను గురుదత్త
పాదద్వయాయ నమః

**ఓం శ్రీ శివ చింతామణి కామధేను కల్పవృక్ష**
**శ్రీ గురుదేవ దత్తాత్రేయాయ నమః**



## అధ్యాయము-6

# గురువుల విశ్వలక్షణము



వికసిత వదనం స్మిత మందహాసం
కరుణామయ నయనం అభయ వరదహస్తం
తేజోమయ రూపం జ్ఞానమిచ్చు మోక్షమిచ్చు చరణం
స్వప్రకాశ ప్రకాశం సదా దర్శయామి.

# గురువుల విశ్వలక్షణము

గురువుల లీలలు తెలుసుకొనుట శఖ్యముకాదు. మన లోని అనుమానపు బుద్ధి నిర్మూలించె విధముగా అవి బహిర్గతమగును. అచంచల నమ్రతపూరిత వి.శ్వాసమును మనలో బలంగా స్థిరపరుచును. సద్గురు ప్రత్యక్ష సర్వజ్ఞత, పరిపూర్ణత మనలోని అహంకారము ("నేను" అనుగుణము)ను నిర్మూలించును. ఈ లక్షణము శిష్యులందెకాదు, నిజమైన అన్వేషకులు సాధకులు అందరి యందు గోచరించును. జ్ఞాని అయిన సాధకుడు అదే విశ్వాత్మను అందరి గురువులలో దర్శింపగలడు.

పై విషయమును ఒక వేదగురువులు ఈక్రింది సంఘటను ప్రస్తావించి, సత్యమని నిర్ధారించిరి. ఒకప్పుడు కొంతమంది వేదపండితులు ఒక విద్యాంసుని సన్మానింప తలంచిరి. ఆసభకు శ్రీ కంచి పరమాచార్యులసమ్మతి మరియు సమక్షము కోరుటకు వారిని దర్శించిరి. శ్రీ పరమాచార్యులు వారిని శ్రీ చందోలు శాస్త్రి గారిని (శ్రీతాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రిగారు) కలుసుకొని సంప్రదించమని ఆదేశించిరి. ఆ విధముగా ఆ వేదపండితులు శ్రీ చందోలు శాస్త్రిగారిని సన్మాన సభకు ఆహ్వానించిరి. శ్రీ చందోలు శాస్త్రిగారు సూచించినట్లు ఆ విద్వాంసునకు బిరుదు ప్రదానము చేసి సన్మానించిరి. తరువాత వారందరు తిరిగి కంచికి

వెళ్ళినప్పుడు ఒక్క మాట కూడ చెప్పకముందె, శ్రీ పరమాచార్యులు వారు ప్రదానము చేయబడిన అదే బిరుదుతో వారిని ఆహ్వానించిరి. ఇద్దరు గురువులు వాస్తవానికి ఒక్కరే అనువిషయము యీ సంఘటన రూఢి చేయుచున్నది.

ఒక ఆశ్చర్యకరమైన విశేషము : శ్రీ చందోలు శాస్త్రిగారు, మన గురువుగారు ఇద్దరు తమ మహాసమాధి స్వీకరణను ముందుగానే శిష్యులకు సూచించిరి. ఇంకను శిష్యులను ఆశీర్వదించుట వారి ఆధ్యాత్మిక ఉన్నతికై పాటు బడుట – వంటి ప్రణాళికలను కొనసాగించుదుమని వారు శిష్యులకు చెప్పిరి. మన గురువుగారి వంటి మహాత్ములు, భగవంతుని చరణములను ఆశ్రయించు వారిని ఉద్ధరించు నిమిత్తము, అవతరించెదరు అని శ్రీ వేదగురువులు సెలవిచ్చిరి. గురువులమధ్య భేదములేదని వారు అంతిమ నిర్ధారణ చేసిరి.

గురువుగారు సిద్ధిపొందుటకు నాలుగు రోజులకు ముందు "నా సాధన పూర్తి అయినది నేను యోగి రాజనయ్యాను" అని ఒక శిష్యురాలుకి చెప్పిరి. వారు శ్రీదత్తులసాక్షాత్కారమును పొందిరి. వారి దివ్య స్థితి సాఫల్యప్రకటన నిమిత్తము యోగిరాజ వస్త్రములనుసమకూర్చిరి "ఈ శరీరములో నాకు నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఇచ్ఛామరణముగా నేను గురు పౌర్ణమి

నాడు నిష్క్రమిస్తాను" అని మరల ఆర్ద్రముగా ఈ శరీరత్యాగము చేస్తున్నాని విచారించకండి. నాదగ్గరకు వచ్చి నన్ను చూడడానికి యిక డబ్బు ఖర్చు చేయ అవసరములేదు "నేను అరూపుడనయినా, ఉపాధిమారిననూ మీరు ఎప్పుడు తలచుకున్నా అప్పుడే ఏరూపములోనైనా మీదగ్గర ఉంటాను" అని ఆశీర్వదించిరి.

సాధనా మార్గములో దేవతలు రక్షకులుగా మనకు ఉండవలెను. బాహ్య రక్షకులతో అవసరంలేదు. నాకు సాధనలో తార, రాజశ్యామల, వారాహి, బగళా రక్షకులుగా ఉన్నారు అని సెలవిచ్చిరి.


శరీరము పరిత్యజించినను, గురువుగారు మాత్రము వారి శిష్య భక్త బృందమునకు చైతన్యాత్మగా నిలచియుండిరి. శ్రీ రమణ మహర్షి వారివలె సాధన కొరకు ప్రపంచములో జీవించుట అవసరమని గురువుగారు సమర్థించిరి. ప్రపంచమునందు ఉండియూ, అన్నింటికి అతీతమై గురువు చెప్పిన సాధన మార్గములో పయనించుటయే మన కర్తవ్యము. ఇది ఆచరించగలిగిన ప్రతీ ఒక్కరు ఉన్నతమైన ఉపేక్షణా భావస్థితిని సాధించినట్లే అగును. గురువుగారి సునిశిత దృష్టి గురు-శిష్యుల మధ్య ఒక అనుబంధమును ఏర్పరుచును. దాని వలన శిష్యులు ఆధ్యాత్మికపథము, చైతన్యచింతనములపై పురోగమించెదరు.

తద్వారా శిష్యునికి ఆత్మజ్ఞానము కలిగి, గురు-శిష్యులను భేదము నశించి, **"దత్తోహమస్మి' "** అను స్థాయి లభించును. "చూచునది అవాస్తవము, అంతరాత్మ మాత్రమే వాస్తవము" అనుసత్యమును అజ్ఞానులందు జాగృతము చేయుట గురువులవిద్యుక్త ధర్మము. నిరంతర చింతనాలక్ష్యము వలన ఇది పూర్ణ శ్రీదత్త శరణాగతి అగునని తెలియ చేయుటకు మాటలఅవసరములేదు. ఒక్కమాట కూడా పలుక కుండా భావములే స్పందించి ఇతరులను చేరగలవు. **"చెప్పబడనిది, చెప్పబడినదానికన్న శక్తిలో మిన్న"**. గురుదత్త జ్ఞానము వలన జాగృతమయిన ఆత్మ విభూతి సర్వబంధముల నుండి విముక్తి చేయును. మహాపురుషుడైన మన గురువుగారు అనుగ్రహించిన విశ్వ వ్యాప్త ఆధ్యాత్మిక వారసత్వసంపదను ఎన్నటికి మనము మరువరాదు.

తదితర ఆధ్యాత్మిక మహానీయులు వాచకములను ఈ అంశముపై ఇట్లు సంగ్రహించవచ్చును. గురువులసహాయమున్న, ఈ సంసార సాగరమును దాటుట సులభము. వారు మనమనస్సులనుండి వ్యర్థపు ఆలోచనలను, వ్యతిరేక ప్రవృత్తిని పారద్రోలెదరు. మనలను వివేకముతో నింపెదరు. మన మనస్సును, హృదయమును పుట్టించినది, సృష్టించినది, పెంచునది, పోషించి కాపాడునది- గురువులే. ఆత్మ సాక్షాత్కారమునకు మనస్సును అధిగమించవలెనని నిర్దేశించిరి.

గురువులు మన అజ్ఞానమును తొలగించి అఖండానందమును ప్రసాదించుదురు. మాయా బంధితులమయిన మనలను మనఃస్మృతిలో నిద్రాణమై యున్న వివేక శక్తులను మేల్కొలిపి విముక్తులగుటకు సహాయము చేయుదురు. "అప్పటికే నీది కానిది, ఎప్పటికి నీది కాదు". అన్న ప్రాతిపదిక మీద గురువులు ప్రవర్తించెదురు. ప్రాపంచిక సంబంధములకు ఒక నైతిక దృక్పథమును కలుగచేయుదురు. ప్రామాణిక విలువల ప్రాముఖ్యతను నిర్దేశించుదురు. ఉపనిషత్తులు కీర్తించిన "బ్రహ్మమను" విశ్వ ధర్మమును అత్యంత జ్ఞానముగా శిష్యులకు తెలియ చేయుదురు. బహుప్రమాద పూరిత జీవన మార్గములపై తోడుగా నడిపించు గురువులఆవశ్యకత అనిర్వచనీయము. దివ్య అవతారులయిన శ్రీరాములు, శ్రీకృష్ణులు వారి గురువులగు శ్రీ విశ్వామిత్రులు, శ్రీ సాందీపులు క్రింద వర్ధిల్లినట్లు ఇతిహాసములలో ప్రస్తావించబడినది.

**గురుమూర్తి స్మరేనిత్యం గురునామ సదాజపేత్ ।**
**గురోరాజ్ఞామ్ ప్రకుర్వీతా గురోరన్యేనభావయేత్ ॥**



# అధ్యాయము-7

# ఆధ్యాత్మిక ఆత్మబంధువు

# ఆధ్యాత్మిక ఆత్మబంధువు

శ్రీ బన్సీధర్ మహంతుగారు గురువుగారికి అత్యంత ప్రియమయిన సన్నిహితులు. మొహంతుజీ అను పిలవబడు వారితో గురువుగారిమైత్రి అతి మనోహరమైన స్నేహగీతిక- వారిద్దరు ఆధ్యాత్మిక బంధువులు. మహంతుజీ గురువుగారి కన్న సుమారు 15 సంవత్సరములు చిన్న. మహా అంజనేయ భక్తులు. గురువుగారు తమ సంభాషణలో తరచు వారిని గురించి ప్రస్తావించెడివారు. పలుమారులు మహంతుజీ ఆశ్రమమునకు వెళ్ళెడివారు. కొన్ని నాళ్ళ క్రితం, కొంతమంది శిష్యులు మహంతుజీని సందర్శించుటకు వెళ్ళినపుడు- గురువు గారు మహాసమాధిని పొందిన తరువాత కూడా తమకు అందుబాటులో ఉన్నారని, ఇప్పటికి వారిరువురి మధ్యా సంభాషణలున్నవని- వారు తెలియచేసిరి. గురువుగారి శిష్యులు కొందరు మహంతుజీని ఒక మధ్యాహ్నము కలుసుకొనడానికి వెళ్ళినపుడు, ముందుగా తెలియచేయకుండవచ్చుట వారికి విశ్రాంతి భంగము కలుగునే మోయని చింతించుచుండగా "మీరాక గురించి నాకు వర్తమానము ఇంతకు ముందె అందినది" అని చెప్పి మహంతుజీ వారి మనస్సులను కుదుట పరచిరి. శిష్యులలో ఒకరు ఆశ్రమము గురించి మహంతుజీతో వివరించబోవు చుండగా- గురువుగారు సిద్ధిపొందక పూర్వమునుండి, తమకు సమగ్రముగా తెలియునని మహంతుజీ వారిని వారించిరి.

"మీ గురువుగారు సాధారణమయిన వ్యక్తులు కారు" అని మహంతుజీ కొనియాడిరి. దశమహావిద్యలను అష్టసిద్ధులను తమ స్వాధీనము చేసికొనిరి. వారికి తెలియని విద్యలేదు. ఒడిస్సా అరణ్యములలోనికి వెళ్ళి, 4-5 మాసములు తరువాత తిరిగి వచ్చెడివారు. ఎలా జీవించెడి వారో ఎవ్వరికి తెలియదు. వారు నిర్ధేశించు కొన్న సాధన పరిసమాప్తినొందు సమయానికి ఫలానా రోజున వచ్చి తీసుకొన వెళ్ళవలసినదిగా మహంతుజీకి సూచించెడివారు.

"మీకు సిద్ధశక్తులపై గట్టిపట్టు ఉందని నాకు తెలుసు. నేను నేర్చుకొనడానికి కొన్నిటిని నాకు చూపించండి" అని ఒకనాడు మహంతుజీ గురువుగారిని కోరిరి. గురువుగారు మందహాసము చేసిరి. ఆశ్చర్యము! రామసీత లక్ష్మణ హనుమంత విగ్రహములు వారి నోటినుండి జాలువారినవి. ఆ విగ్రహములు ప్రస్తుతము మహంతుజీ అధీనమందున్నవి. గురువుగారు మరలచిరునవ్వు నవ్వి "ఎవ్వరు ఇటువంటి ప్రయోగములు, అద్భుతములజోలికి పోరాదు" అని హెచ్చరించిరి. ఇటువంటి విగ్రములు రు. 200/- లకు బజారులో కొనవచ్చును అని మృదువుగా పరిహసించిరి. "ఆత్మజ్యోతితో ఐక్యమగు సాధనను నీకు చూపిస్తాను" అని గురువుగారు ప్రోత్సహించిరి. "ఇటువంటి అద్భుతములను ప్రదర్శనలను చేయవలెనని నిశ్చయించినట్లుయితే గురువుగారు కోట్ల రూపాయలను ఆర్జించెడివారు" అని మహంతుజీ ప్రస్తుతించిరి. వారు జీవించినంతకాలము ఈ అద్భుత

సంఘటనలగురించి ఎప్పుడు ఎవ్వరికి కూడ బహిర్గతము చేయవద్దని గురువుగారు మహంతుజీని కోరిరి. "చిత్త శుద్ధితో మీ సాధనలను చేయండి. కారణం గురువుగారు సాక్షాత్తు అనకాపల్లి ఆంజనేయ దత్తులే!" అని వారిని కలుసుకొన్న శిష్యులకు మంహంతుజీ ప్రభోదించిరి.

గురువుగారు భువనేశ్వరములో ఉన్నప్పుడు అశేష జనులు వారిని దర్శించి కానుకలను సమర్పించెడివారు. అటువంటి కానుకలన్నింటిని గురువుగారు సాయంకాలనికి పంచి పెట్టెడివారు. ఒక్కటి కూడా వారి దగ్గర మిగిలి ఉండేది కాదు. "గురువు గారికి రెండు కౌపీనములమాత్రమే ఎల్లప్పుడు ఉండేవి" అని మహంతుజీ చమత్కరించిరి.


మహంతుజీని సందర్శించడానికి వెళ్ళిన శిష్యురాలు ఒకరు తీవ్రమైన కాలినొప్పితో బాధపడుచుండిరి. వాస్తవానికి ఆ శిష్యురాలు కుర్చీలో కూర్చునుండగా, మహంతుజీ మాత్రము వారికి ఎదురుగా నేలపై కూర్చునుండిరి. ఆక్షణములో ఆ శిష్యురాలుకి తన ఎదురుగా గురువుగారు స్వస్వరూపముతో దర్శనమిచ్చిరి. వెంటనే ఆనంద భాష్పములు కురవగా వడివడిగా సాష్టాంగనమస్కారములను చేసిరి. అప్పుడు మహంతుజీ వారిని దీవించిరి.

మహంతుజీ ప్రసిద్ధి చెందిన జ్యోతిష్కులు కూడా. వారు గురువుగారి జాతక చక్రమును పరిశీలించిరి. "గ్రహ

ప్రభావములకు అతీతులయిన వీరు జగత్ చక్రవర్తి లేదా సమస్త మానవాళిని తమ దివ్య శక్తులతో పరిపోషించు దత్తావధూత అగుదురని జోస్యము చెప్పిరి. గురువుగారు అజాత శత్రువులు. ఆశ్రితులను, శిష్యులను తమ దివ్య శక్తులతో సహాయము చేయుటకు సంసిద్ధులై యుందురు. వారు గోప్యముగా పరమపవిత్రమయిన జీవితమును గడిపెదరు. పసిబాలుని వలె జీవనము చేసెదరు. శక్తి పూజావిధానము అనగా శ్రీ విద్య ఉపాసనందు నిష్ణాతులవుదురు. వారికి శ్రీ అంజనేయ స్వామి సగుణ దర్శనము లభించును. గురువుగారిని మరలమరల కలుసుకొను భాగ్యమునకు భగవంతుని వేడుకుంటాను. నా హితులుగా తాత్వికులుగా మార్గ దర్శకులుగా వారు అనుగ్రహించి దర్శన భాగ్యమును అపారదయతో నాకు ప్రసాదించిరి" అని మహంతుజీ నివేదించిరి.


గురువుగారి నుండి దివ్య జ్ఞాన అనుభవములను పొందిన శిష్యులు అనేకులు ఉన్నారు. వారు గురువుగారి మహిమలకు సాక్షులై ఉన్నారు.

నగురో రధికం తత్వం, నగురో రధికం జ్ఞానం ।
నగురో రధికం తపం, తస్మైశ్రీ గురవే నమః ॥
గురుప్రజ్ఞా ప్రసాదేన మూర్ఖోవా యది పండితః ।
యస్తు సంభద్యతే తత్వం విరక్తో బవసాగరాత్ ॥



# అధ్యాయము -8

# సత్స్వరూప దర్శనము



# సత్‌స్వరూప దర్శనము

ఈ పుస్తకములో అంతర్వాహినిగా ప్రవహించు గురులీలలు శిష్యుల అనుభవముల అవ్యక్త ఉద్దేశ్యము - శిష్యుల మౌన పరివర్తనయే. ఈ పరివర్తన ఆధ్యాత్మిక ప్రగతి అన్వేషణలో శిష్యులను నిలకడగా నడిపించును. మహాసమాధి తరువాత గురువుగారు ఒక శిష్యురాలికి ఈ సందేశమును తెలియజేసిరి. "సాధకుడు శారీరక మానసిక కష్టములను కలిగించు పరీక్షలను ఎదుర్కొనవలసి వచ్చును. వాని విశ్వాసము మరియు సహనము పరీక్షకు గురి చేయబడును. సహించుట బహు కష్టతరమగును. భగవంతుని మార్గము నందు నడపగలశక్తి సామర్థ్యములను క్షీణింపచేయు కష్టములు, భగవంతుని లక్ష్యమునకు మిక్కిలి అంకితమైన వానికి ఎందుకు కలుగును? అన్న ప్రశ్న వచ్చును."

గురువులు, మహాపురుషులు ఆధ్యాత్మిక మార్గమును అభిలషించు కొంతమంది అర్హులయినవారిని ఎన్నుకొందురు. వీరు క్షేత్రములు. గురువులు వీరిపై తీవ్రముగా, నిర్విరామముగా కృషి చేయుదురు. వీరిని క్షేత్రపరముగా - దున్నుదురు, కలుపుతీయుదురు, సాగు చేయుదురు. ఆవిధముగా సాధకుల శారీరక ఉపాధిని ఒకమడిలా సిద్ధము చేయుదురు. ఈ శిక్షణాక్రమము పరీక్షలుగా, ప్రయాసలుగా, బాధలుగా, ప్రలోభములుగా, కష్టనిష్ఠూరములుగా, దక్కవలసిన ప్రతి ఫలములు నష్టములుగా ప్రతిబింబించును. "గురుపాదుకల"పై

దృఢ భక్తితో సాధకుడు సహించు తరుణమునందు ఆధ్యాత్మిక జ్ఞానమునిచ్చు బీజములను నాటుటకు, ఈ క్షేత్రములను గురువుగారు పదిలపరచి సంసిద్ధము చేయుదురు. అవి మొలకెత్తి, పెరిగి సాధకునకు మరియు సంఘమునకు ఫలప్రదానము చేయు "కల్పవృక్ష" మగును.

ప్రగతి పథమునందు గురువు, తమకు శిష్యునికి మధ్యగల భేదమును తొలగించెదరు. కర్మ చక్రమునందు చిక్కుకొని జననమరణ వలయములగుండా మనము పయనించెదము. భగవత్ జ్ఞానము కలిగినపుడు దారిద్ర్య దుఃఖములనుండి విమోచనకై ప్రార్థించెదము. "భక్తి భావన" అనగా భగవత్కృపకై పరితాపము పెరిగిన కొలది ఉపశమనమును పొందుటయే కాక ఈ కర్మశేషములనుండి విమోచన పొందవలెనను స్పృహ క్రమముగా మనకు కలుగును. ఈ అంశము మన సాయశక్తులకు మించినదైననూ విముక్తికై ప్రార్థిస్తూ భగవంతుని శరణు కోరవలెను, ఆశ్రయించవలెను.

మునపటి కర్మలపర్యవసానము ఎదుర్కొనక తప్పదని మనకు సుస్పష్టమగును. ప్రతీ ఒక్కరు వారి కర్మ ఋణములను తీర్చవలసి ఉన్నది. మనము అచంచల విశ్వాసముతో భగవంతుని పాదాక్రాంతులము పరిపూర్ణముగా అయినపుడు సంసారమును దాటి పరమపథమును చేర్చువారధిగా ఒక సద్గురువు కృపా కటాక్షములు లభించును. గురువు ఆశీస్సులతో వారి

ఉపదేశములను పాటించుతూ మన సమస్త కర్మలను స్వీకరించుదురను గట్టి నమ్మకముతో నిశ్శంశయముగా గురుపాదములను శరణుపొందవలెను.

ఈ శరణాగతి భావముతో మనము కర్మవృత్తములందు పరిభ్రమించునపుడు ఒక దశలో సంపూర్తిగా ఋణ విముక్తి కలుగును. అప్పుడు జ్ఞానోదయమగును. పూర్వము మనమే "కర్త" (కర్మచేయువాడు) "భోక్త" (కర్మఫలమును అనుభవించువాడు) లేక "కారకులు" (బాధించు పరులు) గా భావించెడివారము. అందువలన ఒక రకమైన శరణాగతి భావముతో ఉపశమనముకై గురువుగారిని "ఉద్ధారకులుగా" ప్రార్థించెడివారము.

ఇప్పుడు పూర్వపు కర్మ జాడలు అదృశ్యమవడము వలన "తటస్థ" ప్రేక్షకుడుగా మనల్ని మనము గమనిస్తాము. ఈ "తటస్థ స్థితి" నుంచి గమనించి విచారించిన మనము కర్మ లేక భోక్త లేక కారకులు కాదని అవగతమవుతుంది. ఈ అజ్ఞాన తెరలు పొరలు వలన పూర్వము మనల్ని మనము అనునయించుకుంటిమి. అలాగే ఇతరులను దండించి మనలను మనము సమర్థించుకుంటిమి. మన న్యాయాన్యాయ దృష్టి గురుపాద శరణాగతి నుండి ఉత్పన్నమైనప్పటికి పక్షపాత పరమయినది. ఈ దోషారోపణ ప్రక్రియ (పరనింద) అవాంఛ నీయ కర్మ అగును.

ఈ నిష్పక్షబుద్ధితో ఆలోచించి, ఆచరణ చేయు మొదలిడినపుడు – కర్త, భోక్త, కారకుడు – ఏదీ మనము కాదు

అనువాస్త్రమును గ్రహించుట వలన మనకర్మ పాశములు ఛిద్రమగును. అప్పుడు విమర్శనాత్మకముగా శుద్ధమైన నిర్మలమైన వివేక దృష్టితో చరించవచ్చును. అంతరంగమునుండి ఉద్భవించిన ఈ జ్ఞానము "ఆత్మ సాక్షాత్కారము" పొందువరకు మనలను క్రమముగా నడిపించు అంతర్గత గురువుతో మనలను ఒకరుగా గుర్తింపజేయును. మనము బాహ్యముగా పూజించి, శరణాగతి పొందిన గురువు, ఇప్పుడు అంతర్గతముగా మనలను నడిపించుచున్నారు అని అవగతమవును. వారు శుద్ధ చైతన్య మూర్తులు గాక వేరుకాదు. ఈ జ్ఞానమే ఆత్మ సాక్షాత్కారము. అనగా గురువు అంతరంగ జనిత జ్ఞాన స్వరూపులు. అప్పుడు బాహ్య ప్రపంచముతో సంబంధము లేని పరిపూర్ణ స్వచ్ఛందశాంతి విలసిల్లును. అది అంతర్గత అమర ఆత్మనందలి ప్రశాంతత నందు వశించును.


ఆ విధముగా గురువు బాహ్య స్వరూపు లేకాదు. ఇప్పటి నుంచి వారు స్వప్రకాశకులు- అంతర్స్సిద్ధమైన చైతన్యులు. ఇది గురువుతో మమేకమైన సత్‌స్వరూపస్థితి. ఈ స్థితినందు ఉన్నది - బ్రహ్మానందము - స్వప్రకాశనందము మాత్రమే.

**చైతన్యం శాశ్వతం శాంతం వ్యోమాతీతం నిరంజనం ।**
**నాదబిందుకళాతీతం తస్మై శ్రీ గురవే నమః ॥**



## అధ్యాయము -9

# గురు వైశిష్ట్యము



# గురు వైశిష్ట్యము

ఆది గురువు శ్రీ దత్తాత్రేయులు నుండి మన గురువుగారు వరకు - అందరు గురువులు, వారెవ్వరైనప్పటికి గొప్ప ఆత్మ స్వరూపులు, పూజ్యనీయులు. మనకు జన్మనిచ్చిన తల్లిదండ్రులు ఈ జన్మకే పరిమితము. కానీ **జన్మజన్మలకు తోడుగా నుండు సద్గురువు కొరకు దత్త పూర్ణిమ, గురు పూర్ణిమ వేడుకలను నిర్వహించుట మన విద్యుక్త ధర్మము.**

పునరపి జన్మ చక్రము నుండి గురువు మనలను విముక్తి చేయుటేకాదు, జీవనముక్తి చేయగలరు. అద్వైత స్థితిని ప్రసాదించగల సర్వసమర్థులు గురువు. ఈ కలియుగంలో సద్గురువు మనకు దొరకుట బహు దుర్లభము. యోగిరాజ శ్రీ స్వామిస్వప్రకాశానంద సద్గురువులు ఆధ్యాత్మిక పథ ప్రవేశమునకు దీక్షను యివ్వడమేకాక, మన జీవితములను గడుపు రీతిని కూడ నిర్దేశించిరి. సాధకుడు క్రియా శీలియైన శిష్యుడు కావున, ఆధ్యాత్మిక మార్గమున పురోగమించుటకు గురువుగారు మంత్ర సాధన, ధర్మమైన జీవన సరళి, ఆత్మ సాక్షిగా కర్మలనిర్వహణ సమన్వయమును ప్రతిపాదించిరి. వారి ఆధ్యాత్మిక తపః ఫలసారమును మనకు ప్రసాదించిరి. కావున శిష్యులుగా వారు చేసినట్లు మనము ఎట్టి కఠోర తపస్సు చేయవలసిన పనిలేదని

గురువుగారు చెప్పిరి. ఆవిధంగా ఆధ్యాత్మిక మార్గ పురోగమనం వారు మనకు సులభతరము చేసిరి.


స్మరించిన మరుక్షణంలో గురువుగారు సదా మనతో ఉంటారు. అప్పుడు ఇప్పుడు కూడ తలచిన తక్షణం గురువుగారు మనతో ఉంటారు. **అది వారి "దీక్ష"- అదే వారి "సాధన".** అటువంటి "చిన్మయ గురువు" యొక్క ఋణము చెల్లించుటకు మనము ఏమి సమర్పించగలము?.

వారికేది సమర్పించినప్పటికి అది చంద్రునికొక నూలుపోగు, సూర్యుని ముంగిట చిరుదివ్వెమాత్రమే అగును. ఈ బ్రహ్మాండము అంతా వారిదే! వారు స్వప్రకాశానందులు - స్వయంజ్యోతి స్వరూపులు. మనము వారి ఒడిలో పసిబిడ్డలము. వారు చూపించిన జ్ఞాన మార్గంలో అడ్డంకులు ఎన్ని ఉన్నా ఏకొద్దిదూరం పయనించిన, మనకు గురుపాదములు ఆలంబనమై ఉండును. కష్టములను అధిగమించి, సంపూర్ణ విస్వాసముతో వారి దివ్యసాయుధ్యమును పొందవచ్చును. ఈ దివ్యప్రేమ స్థితిలో కోపతాపములు, లౌకిక వాంఛలు ఉండనేరవు. భిన్నత్వములను అధిగమించి అందరిలో ఏకత్వగుణమునుచూడగల విశ్వప్రేమను మనలోనింపి శ్రీగురుదేవులు ధన్యత్వమును ప్రసాదించుదురు గాక!

**ముగింపుగా ఒక సింహావలోకనము :** గురువుగారు దివ్యధామమును చేరినప్పుడు అక్కడ గురువు-శిష్యుడు అను భేదములేదు. వారు దత్తోహమస్మి స్థితిని పొందిరి. వారు స్వరూప స్థితిని అధిగమించి అరూపులై ఆఖండ జ్యోతిలో లీనమై దత్త స్వరూపులు అయిరి. స్వప్రకాశులై, సర్వాత్మ స్వరూపులై స్వయముగా శ్రీదత్తులైనారు. **దత్తోహమస్మి । దత్తోహమస్మి । దత్తోహమస్మి ।**

ఓం ఉపదేశ కర్తాయ జగత్‌గురువె, సద్గురు స్వరూపాయ, సచ్చిదానందాయ, శాంతాయ, గురుబ్రహ్మా, గురువిష్ణుః, గురూర్ మహేశ్వరాః, గురూర్ లక్ష్మీ, గురు సరస్వతీ, గురు పార్వతీ, గురు సర్వ మంత్ర యంత్ర తంత్రాః, గురూర్‌విద్యా, గురూర్ సర్వక్షేత్రాయ, గురూర్‌సర్వతీర్థాయ, గురూర్ చతుర్వేదాయ, గురూర్ ప్రస్తానత్రయాయ, గురూర్ సర్వోపనిషద్ సారాయ, గురూర్ ఆత్మాయ, గురూర్ సర్వమ్, గురూర్ అన్యాత్ కిచిత్ నాస్తాయ, గురూర్ శక్తి, గురు స్వరూపాయ శక్తిమయాయ, మౌనాయ, ఆత్మావతారాయ, దత్తాత్రేయాయ స్వామి స్వప్రకాశానంద తీర్థావధూత యోగిరాజ గురవే నమః.

**సదా దత్తోహమస్మి । సదా దత్తోహమస్మి । సదా దత్తోహమస్మి ।**



[illegible]


[illegible]

1 [illegible]

[illegible]

[illegible]





యోగిరాజ శ్రీ స్వామి స్వప్రకాశానంద తీర్థావధూత